ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 31.0
కనిష్ఠం : 20.0

ఖరీఫ్‌లో 51 లక్షల టన్నుల ధాన్యం కొంటాం

- 24 గంటల్లో రైతుల ఖాతాల్లో సొమ్ము జమ
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్

చింతలపూడి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 51 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామని పౌర సరఫరాల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. చింతలపూడిలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరుల తో మాట్లాడుతూ.. 'ధాన్యం కొనుగోలు కేంద్రాలను నియోజకవర్గాల్లోను, మండలాల్లోను ప్రారంభించాం. 16 వేల మంది సిబ్బంది పనిచేస్తున్నారు. రైతులు తమ ధాన్యం అమ్ముకుంటే 24 గంటల్లోపే ఖాతాల్లో జమ అవుతాయి. గతేడాది రూ.12,800 కోట్ల విలువైన 34 లక్షల టన్నులు కొనుగోలు చేశాం. గతేడాది అకాల వర్షం, ప్రకృతి విపత్తుల వల్ల కొనుగోలు కేంద్రాల్లో టార్గెట్ అయిపోయిన తర్వాత తడిసిన ధాన్యం రాగా దానికి సంబంధించి రూ.800 కోట్లు జమ చేయడంలో జాప్యం జరిగింది. ఇప్పటికీ పశ్చిమగోదావరి జిల్లాలో రూ.2 కోట్ల 80 లక్షలు జమ చేయాల్సి ఉంది. పాత బకాయిలు రూ.31 కోట్లు విడుదల చేశాం. గత ప్రభుత్వం రూ.వెయ్యి కోట్లు బకాయి పడగా వాటిని రెండు దఫాలుగా చెల్లించాం. డిసెంబరులోగా మూడో దఫా చెల్లిస్తాం. ఈ ఏడాది 36 వేల లారీలు, ట్రాక్టర్లు, వాహనాలు టార్గెట్ లక్ష్యం కాగా ఇప్పటికి 28 వేల లారీలు, ట్రాక్టర్లకు జీపీఎస్‌లు చేశారు. తేమ శాతం విషయంలో ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దు' అని పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు సొంగా రోషన్‌కుమార్, చిర్రి బాలరాజు, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి, ఏఎంసీ మాజీ చైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మేకా ఈశ్వరయ్య, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


జిల్లాలోని రెండు ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లకు శంకుస్థాపన, ఒక ఎంఎస్ఎంఈ పార్కును వర్చువల్‌గా సీఎం చంద్రబాబు కనిగిరి నుంచి మంగళవారం ప్రారంభించారు. ఈ మేరకు ద్వారకాతిరుమల మండలం సీహెచ్ పోతేపల్లిలో గోద్రేజ్ ఆగ్రోవేట్ లిమిటెడ్ పరిశ్రమ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి నాదెండ్ల. చిత్రంలో ఎమ్మెల్యేలు పత్సమట్ల ధర్మరాజు, బొలిశెట్టి శ్రీనివాస్, కలెక్టర్ వెట్రిసెల్వి తదితరులు.
లోపలి పేజీలో..


సీఆర్ఆర్ రెడ్డి స్కూల్ విద్యార్థిని తేజశ్రీ నాట్య ప్రదర్శన

యువజనోత్సాహం!

ఏలూరు సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల ఆడిటోరియంలో మంగళవారం జరిగిన యువజనోత్సవాల్లో ప్రదర్శనలు చూపరులను కట్టిపడేశాయి. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర యువజన సర్వీసులు, సాంస్కృతిక వ్యవహారాలశాఖ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. జిల్లాలోని జూనియర్, డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలల నుంచి పెద్దసంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు.
లోపలి పేజీలో..


జాతీయ రహదారిని పరిశీలిస్తున్న అధికారులు

రోడ్డు ప్రమాదాలకు చెక్!

- జాతీయ రహదారిపై డేంజర్ స్పాట్స్ పరిశీలించిన అధికారుల బృందం

ఏలూరు క్రైం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పదహారవ నెంబర్ జాతీయ రహదారిపై తరచుగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణ కోసం వివిధ శాఖల అధికారులందరూ కలిసి సంయుక్తంగా జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను మంగళవారం పరిశీలించారు. కలపర్రు టోల్‌గేటు, రామచంద్ర ఇంజనీరింగ్ కాలేజీ, అమ్మపాలెం పెట్రోల్‌బంక్, చింతలపూడి బ్రిడ్జి, కొవ్వలి, గుండుగొలను, సత్యనారాయణపురం బ్రిడ్జిలు, గుండుగొలను సెంటర్‌లలో ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరగడం వల్ల ప్రమాద నివారణ కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని ఈ బృందం గుర్తించింది. తనిఖీల్లో దెందులూరు ఎస్ఐ శివాజీ, ఎన్‌హెచ్ ఏఈ దుర్గా విఠల్, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ షేక్ మీరావలి, ఆర్అండ్‌బీ వర్క్ ఇన్‌స్పెక్టర్, డీటీఆర్బీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ నివేదికను ఎస్పీ కేపీఎస్ కిశోర్‌కు అందజేయనున్నారు.

భవిత కేంద్రాల హెచ్‌ఎంలకు అవగాహన

ఏలూరు అర్బన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి):ప్రత్యేకావసరాలు గల పిల్లల(సీడబ్ల్యుఎస్ఎన్) కోసం జిల్లాలో సమగ్ర శిక్షాభియాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భవిత కేంద్రాల హెచ్‌ఎంలకు మంగళవారం సుబ్బమ్మదేవి మున్సిపల్ హైస్కూలులో ఒకరోజు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఈవో వెంకటలక్ష్మమ్మ మాట్లాడుతూ పిల్లలకు ప్రభుత్వం అందించే పథకాలు, సదుపాయాలు క్షేత్రస్థాయిలో నూరుశాతంచేరేలా అంకితభావంతో పనిచేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్ఎస్ఏ విలీనవిద్య రాష్ట్ర కో-ఆర్డినేటర్ వనజ మాట్లాడుతూ సీడబ్ల్యుఎస్ఎన్ పిల్లలు క్రమం తప్పకుండా తరగతులకు హాజరయ్యేలా చూడాలన్నారు. డీవైఈవో రవీంద్రభారతి, ఎంఈవో అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా పటిష్టంగా!



- షేర్‌వాల్ టెక్నాలజీతో పేదల ఇళ్లు
- తొలిసారి కైకలూరులో నిర్మాణాలు

కైకలూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి):షేర్‌వాల్ టెక్నాలజీని వినియోగించి అతి తక్కువ ఖర్చుతో కైకలూరులో పేదల ఇళ్లను నిర్మించేలా శ్రీకారం చుట్టింది. ఈ పద్ధతిలో ఇప్పటికే ఇరవై ఇళ్లను పూర్తిచేశారు. వైసీపీ పాలనలో ఇష్టానుసారంగా ఇళ్ల నిర్మాణం చేపట్టి పునాది లెవెల్‌లో అనేక ఇళ్లు వదిలివేశారు. దీంతో లబ్ధిదారులు సొంతింటి కల నెరవేరక దిక్కుతోచక స్థితిలోకి వెళ్లారు. పూర్తిస్థాయిలో నిర్మాణం కాకపోవడం, పైగా ఒక బెడ్ రూంకే పరిమితమయ్యారు. కూటమి ప్రభుత్వం షేర్‌వాల్ టెక్నాలజీతో రెండు బెడ్ రూంలు, హాలు, కిచెన్, మెట్లు, బాత్రూమ్ నిర్మాణాలు చేపట్టారు. ఈ షేర్‌వాల్ టెక్నాలజీ వల్ల ఇంటి నిర్మాణం వేగంగా పూర్తి కావడం లబ్ధిదారుడికి ఇంటి ముందు ఎల్ ఆకారంలో ఖాళీ స్థలం ఉండడంతోపాటు గాలి, వెలుతురు వస్తోంది.

ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ కైకలూరులో ఇళ్ల నిర్మాణాల్లో లబ్ధిదారులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని తక్కువ ధరలో ఇంటి నిర్మాణం చేయాలని ఆలోచన చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇళ్ల నిర్మాణం చేసిన కాంట్రాక్టర్ సహకరించకపోవడంతో కొత్త కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కైకలూరులో మొదటిసారిగా ఈ షేర్‌వాల్ టెక్నాలజీతో 1450 ఇళ్ల నిర్మించాలని సంకల్పించారు. ఇప్పటికే నిర్మించిన ఇరవై ఇళ్లలో లబ్ధిదారులు నివసిస్తున్నారు. పునాది నుంచి శ్లాబు, మెట్లు, పిట్ట గోడలు నిర్మిస్తారు. లబ్ధిదారుడు కొంత వాటా చెల్లించాలి. ప్రతీ ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు మంజూరు చేస్తుంది. లబ్ధిదారులు సహకరిస్తే నెలకు 60 ఇళ్లు నిర్మిస్తారు. ఈ ఆధునిక టెక్నాలజీ లబ్ధిదారులకు మేలు చేస్తుందని త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.


షేర్‌వాల్ టెక్నాలజీతో నిర్మాణం

సెంటున్నరలో ఇలా

- సెంటున్నర స్థలంలో షేర్ వాల్ టెక్నాలజీతో నిర్మిస్తున్న ఇంటిలో రెండు బెడ్ రూమ్‌లు వుంటాయి. వీటి పొడవు, వెడల్పులు ఒకటి 11/10.5, మరొకటి 11/9.5 అడుగులు, హాలు 12/7.5 అడుగులు, కిచెన్ 7/7.5 అడుగులు. ఇంటి ముందు ఎల్ షేప్‌లో ఖాళీ ప్రదేశం, మెట్లు, బాత్రూం ఉంటాయి.

ఇళ్లు నిర్మించకుంటే..

- కైకలూరు-ఏలూరు రోడ్డులో గ్రీన్ విలేజ్‌లో ఇళ్ల నిర్మాణాలకు ఎంపికైన లబ్ధి దారులు వచ్చే మార్చి నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయకపోతే పట్టాలు రద్దు చేసే పరిస్థితులు ఉన్నాయని గృహ నిర్మాణ శాఖ డీఈ వీవీఎస్ శేఖర్ తెలిపారు.

నేడు జిల్లాలో 15,204 ఇళ్లకు గృహ ప్రవేశ మహోత్సవం

ఏలూరుసిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రంలో చేపడుతున్న మూడు లక్షల గృహ ప్రవేశ మహోత్సవ కార్యక్రమాల్లో భాగంగా ఏలూరు జిల్లాలో కూటమి ప్రభుత్వ హయాంలో నూతనంగా నిర్మించిన 15,204 గృహాలకు నియోజకవర్గ స్థాయిలో ఈనెల 12వ తేదీన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు గృహప్రవేశ మహోత్సవ కార్యక్రమాల్లో పాల్గొంటారని జిల్లా గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జి. సత్యనారాయణ మంగళవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఇదే కార్యక్రమంలో కొత్తగా గృహాలకు మంజూరు కాబడిన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తారు. ఈ నేపథ్యంలోనే కొత్తగా ఇళ్ల మంజూరు కోసం లబ్ధిదారుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా సంబంధిత గ్రామ సచివాలయాల్లో చేస్తారని ఆయన వివరించారు.

ఆటోమేటిక్ రైల్వే పనుల కారణంగా పలు రైళ్ల రద్దు

లోపలి పేజీలో..

జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్ట్ 30 అమలు

ఏలూరు క్రైం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్టు 30 అమలుకు ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిశోర్ ఆదేశాలు జారీ చేశారు. జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్టు 30(ఇండియన్ పోలీస్ యాక్టు సెక్షన్ 30)ని ఈనెల 18వ తేదీ నుంచి డిసెంబరు 17వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా అమలులో ఉంటుందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. బహిరంగ సభలు, ప్రదర్శనలు, ర్యాలీలు, ధర్నాలు నిర్వహించాలంటే స్థానిక పోలీసు అధికారుల నుంచి ముందుగా అనుమతి పొందాలన్నారు. ఏదైనా ప్రాంతంలో శాంతి భద్రతలకు భంగం కలిగే అవకాశం ఉంటే పోలీసులు ఆ సమావేశాన్ని నిషేధించవచ్చని లేదా ఆంక్షలు విధించవచ్చన్నారు. అనుమతి లేకుండా సభలు, ర్యాలీలు నిర్వహిస్తే పోలీస్ యాక్టును లేదా ఐపీసీ సెక్షన్ల ప్రకారం కేసులు నమోదు చేస్తామన్నారు.


ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

ఏకగ్రీవంగా ఏపీ కో-ఆపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ ఎన్నికలు

ఏలూరు, నవంబరు11(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ ఏలూరు జిల్లా ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినట్లు ఎన్నికల అధికారి డి.రాజారత్నం మంగళవారం ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా ఎర్రా ఏసుకుమార్, సహ అధ్యక్షుడిగా కె.నరసింహమూర్తి, ఉపాధ్యక్షులుగా ఆర్.కిరణ్‌కుమార్, సెక్రటరీ షేక్ నజీర్, జాయింట్ సెక్రటరీ(ఉమెన్)గా జి.శాంతకుమారి, కోశాధికారిగా బి.ప్రభాకర్‌రావు, క్యాడర్ సెక్రటరీగా కేవీ సోమేశ్వరరావు, సీహెచ్ మంగతాయారు ఎన్నికయ్యారు. ఎన్నికైన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యవర్గం మూడేళ్ల కాలం పనిచేస్తుంది. కో-ఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ పెనుమత్స శివ నాగరాజు, మన్నేబాబు, లక్ష్మణరావు, జిల్లా ఎన్జీవోస్ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ కార్యదర్శి నెరుసు రామారావు, రాష్ట్ర జేఏసీ అసిస్టెంట్ సెక్రటరీ ఆర్ఎస్ హరనాథ్ పాల్గొని నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

పది పరీక్షల ఫీజు చెల్లింపునకు తేదీలివే..

ఏలూరు అర్బన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి):వచ్చే ఏడాది మార్చి/ఏప్రిల్‌లో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు రెగ్యులర్, గతంలో ఫెయిలైన విద్యార్థులు ఫీజును అపరాధరుసుం లేకుండా ఈనెల 13 నుంచి 25వ తేదీలోగా చెల్లించేందుకు గడువు ఉందని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. పెనాల్టీ రూ.50లతో డిసెంబరు 3వరకు, రూ.200లతో కలిపి డిసెంబరు 10వరకు, రూ.500లతో కలిపి డిసెంబరు 15లోగా చెల్లించవచ్చన్నారు. విద్యార్థుల వివరాలు పాఠశాల యుడైస్ ప్లస్‌లో సరిగా ఉన్నట్టు నిర్ధారించుకున్న తర్వాతే హెచ్‌ఎంలు పరీక్ష ఫీజును వసూలు చేయాలని ఆదేశించారు. నామినల్ రోల్స్‌ను ఆన్‌లైన్‌లో సమర్పించేందుకు ప్రధానోపాధ్యాయులు యూజర్ మాన్యువల్‌లో చేసిన సూచనలను పాటించాలన్నారు.

జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో కొనసాగుతున్న ప్రక్షాళన

ఏలూరు అర్బన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి):జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో పనితీరు సరిగా లేని ఇద్దరు సీనియర్ అసిస్టెంట్ల డిప్యూటేషన్లను రద్దు చేయడంతోపాటు, నిబంధనలకు విరుద్ధంగా గత డీఎంహెచ్‌వో పాలనలో రాజమహేంద్రవరానికి పంపిన ఆఫీస్ సబార్డినేట్‌ను వెనక్కి రప్పించాలని నిర్ణయించారు. ఆరోపణలు, విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటున్న ఉద్యోగులపై క్రమశిక్షణచర్యలను డీఎంహెచ్‌వో డాక్టర్ అమృతం కొద్దిరోజులుగా తీసుకుంటున్న విషయం విదితమే. రాష్ట్రవ్యాప్తంగా 20 జిల్లాల డీఎంహెచ్‌వో కార్యాలయాలకు పరిపాలనాధికారు(ఏవో)లను పదోన్నతులపై రెగ్యులర్ ప్రాతిపదికన ఈ నెలాఖరులోగా నియమించనున్నారని డీఎంహెచ్‌వో తెలిపారు.

మద్ది పీఠం ఎవరిని వరించేనో?

- కొంత కాలంగా నాన్చుతున్న పార్టీల అధిష్ఠానాలు
- ఎదురుచూస్తున్న కూటమి నేతలు
- టీడీపీ సీనియర్ నేత రాజాన పండు పేరు ఖరారు..?

జంగారెడ్డిగూడెం రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి):గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి దేవస్థాన అభివృద్ధి కమిటీ చైర్మన్ పీఠం ఎవరిని వరించేనో అన్న సందిగ్ధం నెలకొంది. రేపు, మాపు అంటూ నానుస్తున్న కూటమి పార్టీల అధిష్ఠానాల వైఖరి పట్ల నేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మద్దిలో వైభవంగా జరిగే కార్తీకమాస పూజలకు ముందే కమిటీని నియమిస్తారని ఆశించినా తుది నిర్ణయం తీసుకోకపోవడంతో ఆశావహుల్లో నిరాశ నెలకొంది. ఇప్పటికే రెండేళ్లు గడిచిపోయింది. ఇంకా పార్టీ ఉండేది మూడేళ్లు. ఇక తమకు గుర్తింపు లేకుంటే ఎలా? అంటూ నిరుత్సాహం చెందుతున్నారు. మద్ది దేవస్థాన చైర్మన్ పీఠాన్ని టీడీపీ సీనియర్ నేత రాజాన సత్యనారాయణ(పండు) ఆశిస్తున్నారు. ఇప్పటికే అధిష్ఠానానికి తన అభ్యర్థన అందజేశారు. ఆయన 25 ఏళ్లపాటు జంగారెడ్డిగూడెం గ్రామ దేవత గంగానమ్మ ఆలయ కమిటీ చైర్మన్‌గా సుపరిచితులు. నూకాలమ్మ ఆలయాన్ని నిర్మించి శాశ్వత చైర్మన్‌గా ఉన్నారు. గోకుల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి ఆలయం, గుర్వాయిగూడెం అయ్యప్పస్వామి దేవస్థానం అభివృద్ధి కమిటీల్లో సభ్యులుగా వ్యవహరిస్తున్నారు. దీంతో చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్, ఎంపీ పుట్టా మహేశ్‌యాదవ్, టీడీపీ జిల్లా నాయకుడు గన్ని వీరాంజనేయులు సత్యనారాయణ పేరును అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్లినట్టు సమాచారం. జంగారెడ్డిగూడెంకు చెందిన మరో సీనియర్ నేత అబ్బిన దత్తాత్రేయ, లక్కవరానికి చెందిన చిక్కాల అంజి, తడికమళ్ల గోపాలరావు తదితరుల పేర్లు వినిపించినా పండుకు ఉన్న పట్టుతో వారంతా సైలెంట్ అయ్యారు. జనసేన నుంచి వ్యాపారవేత్త ఉక్కుర్తి సీతారాం చైర్మన్ పదవిని ఆశిస్తున్నట్టు ప్రచారం సాగింది. అయితే చింతలపూడి నియోజకవర్గంలో మద్ది ఆలయం ఉంది. ఇప్పటికే చింతలపూడి ఏఎంసీ చైర్మన్ పోస్టును జనసేనకు కేటాయించారు. ఈ క్రమంలో మద్ది చైర్మన్ పీఠానికి జనసేన పోటీకి రాదని చెబుతున్నారు.



గోకుల పారిజాతగిరి దేవస్థాన ధర్మకర్తల మండలి నియామకం

- చైర్మన్‌గా అల్లూరి రామకృష్ణ.. మరో పదకొండు మంది సభ్యులు


అల్లూరి రామకృష్ణ

జంగారెడ్డిగూడెం,నవంబరు 11(ఆంధ్రజ్యోతి):గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వర స్వామి దేవస్థాన ధర్మకర్తల మండలిని ప్రభుత్వం నియమించినట్టు ఈవో కలగర శ్రీనివాస్ తెలిపారు. ధర్మకర్తల మండలి చైర్మన్‌గా తెలుగుదేశం పార్టీకి చెందిన అల్లూరి రామకృష్ణ నియమితులవగా కూటమి పార్టీలకు చెందిన మరో పదకొండు మందిని సభ్యులుగా నియమించారు. అన్నాప్రగడ వీర రాఘవరావు, కన్నా గోపాలకృష్ణ, కొప్పుల నాగసురేంద్ర, మడ్డి ప్రసాద్, ఆరేపల్లి నాని, దండు భవాని వెంకటలక్ష్మి, వడిగళ్ల లోవకుమారి, మాదిగాని ప్రియాంక, ముప్పిడి భాను, సత్యవాడ దివ్యప్రసన్న, ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరి రవికుమార్ ఆచార్యులను నియమించారు. త్వరలో నూతన ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం చేయనున్నట్టు ఈవో తెలిపారు.

నిధుల్లేక.. పనులు జరక్క!

- జిల్లాలో అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనాలు
- అద్దె భవనాల్లో 837 కేంద్రాలు
- నాడు-నేడు పనులకు విముక్తి ఎప్పుడు..?

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో అంగన్‌వాడీ అవస్థలకు చెక్ పడేదెన్నడో అన్న ఆందోళన సర్వత్రా వ్యక్తం అవుతోంది.కూటమి ప్రభుత్వం వచ్చి 18 నెలలు అవుతున్నా ఇంకా నాడు-నేడు కింద నిలిచిపోయిన అసంపూర్తి భవనాలపై కదలిక రాలేదు. ఈ పనులను జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం(ఎన్ఆర్ఈజీఎస్) కింద పూర్తి చేయాలని ఇటీవల యోచించినా... ఇంకా ఒక అడుగు కూడా ముందుకు పడలేదు. దీంతో ప్రజల అవసరాలు పెరుగుతున్నా.. ఈ కేంద్రాల అసంపూర్తి భవనాల నిర్మాణాల విషయంలో ఇంకా మొండి చెయ్యే ఎదురవుతోంది. మారుమూల గ్రామాల్లో ఇంకా ఈ కేంద్రాల విస్తరణ సాగకపోగా.. జిల్లాలో పట్టణం, పల్లెల్లో ఇంకా 837 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొత్త భవనాలేమి సాగకపోవడంతో ఈ కేంద్రాలు అవస్థల నడుమ కునారిల్లుతున్నాయి.

నాడు-నేడు భవనాలను ఎలా పూర్తి చేస్తారో?

జిల్లాలో వైసీపీ ప్రభుత్వం హయాంలో నాడు-నేడు కింద 92 భవనాలు నిర్మాణాలు ప్రారంభించగా, ఇప్పటి వరకు కేవలం రెండే పూర్తయ్యాయి. గతంలో అన్ని పథకాల కింద కలిపి మొత్తం 167 భవనాలు బేస్‌మెంట్ స్థాయికి వచ్చి నిలిచిపోయాయి. అప్పటి నుంచి వీటిని పట్టించుకునే వారే కరువయ్యారు. కాగా ఎన్ఆర్‌జీఎస్ పథకం కింద వీటిని పూర్తి చేయడానికి అవకాశాలున్నప్పటికీ యంత్రాంగం పూర్తిస్థాయిలో దృష్టి పెట్టడం లేదు. గత టీడీపీ హయాంలోని భవనాలు నిలిచిపోయినట్టు అధికారులు చెబుతున్నారు.


దెందులూరులో అద్దె భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

ఉన్నతాధికారులకు నివేదికలతో సరి..

ఇదిలా ఉండగా అసంపూర్తి భవనాల నిర్మాణం విషయంలో ఉన్నత స్థాయిలో సమాచారం అడిగినప్పుడల్లా జిల్లా మహిళాశిశు అభివృద్ధి సంస్థ అధికారులు నివేదికలను పంపుతూనే ఉన్నారు. ఇప్పటికీ అతీగతీ లేదు. నిధులు కొరత వల్ల ఈ భవనాల నిర్మాణాలను పట్టించు కోవడం లేదన్న విమర్శలున్నాయి. ప్రధానంగా ఎంపీ ల్యాడ్స్‌తోను వీటిని పూర్తి చేయడానికి అవకాశం ఉంటుంది.ఈ దిశగా కొన్ని భవనాలకైనా నిధులు విడుదల చేసే దిశగా అధికారులు ప్రయత్నాలు మొదలెడితే కొన్ని నిర్మాణాలైనా పూర్తి చేయడానికి అవకాశం ఉంటుంది.అసంపూర్తి భవనాల పరిస్థితిపై ఐసీడీఎస్ పీడీ పి.శారదను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా వివిధ దశల్లో ఉన్న వాటి వివరాలను ఉన్నతాధికారులకు నివేదించామని, నిధులు మంజూరు జరగాల్సి ఉందన్నారు.



పొగాకు నాట్లు వేసిన చేను

సాగుకు సై..!

- పుల్‌జోష్‌లో పొగాకు రైతులు
- కలసి వచ్చిన వరుస నాలుగు సీజన్‌లు
- అందరి చూపు వర్జీనియా పొగాకు సాగుపైనే
- అమాంతం పెరిగిన సాగు విస్తీర్ణం
- ఆకాశాన్నంటిన భూమి, బ్యారన్‌ల కౌలు ధరలు

జంగారెడ్డిగూడెం రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రధాన వాణిజ్య పంటైన వర్జీనియా పొగాకు సాగు ప్రారంభమైంది. వరుస నాలుగు సీజన్‌లు కలసి రావడంతో రైతులు పుల్‌జోష్‌లో ఉన్నారు. అక్టోబరు నెలంతా వరుస తుఫాన్‌ల కారణంగా నవంబరు రెండవ వారంలో వర్జీనియా పొగాకు సాగు పనులు ముమ్మరం చేశారు. రెండు, మూడు రోజులుగా దుక్కులు దున్నడం, సాళ్ల తోలడం, నాట్లు వేసే పనుల్లో రైతాంగం అంతా నిమగ్నమయ్యారు. ఈ ఏడాది కూడా లాభాలు రావాలంటూ కోటి ఆశలతో సాగు ప్రారంభిస్తున్నారు. మరో పక్క పెరుగుతున్న ఖర్చులు, పెట్టుబడులు, కౌలు ధరలు రైతులను ఆందోళన కల్గిస్తున్నాయి.

• జిల్లాలో జంగారెడ్డిగూడెం వేలం కేంద్రం-1, జంగారెడ్డిగూడెం కేంద్రం-2, కొయ్యలగూడెం, దేవరపల్లి, గోపాలపురంలలో మొత్తం 5 వేలం కేంద్రాల ద్వారా వర్జీనియా పొగాకు కొనుగోలు చేస్తుంటారు. జిల్లాలో మొత్తం 14500 బ్యారన్లు ఉన్నాయి. ఒక సీజన్‌కు వచ్చి 60వేలు 70వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు.

ఎకరం భూమి కౌలు రూ.లక్ష

ఎన్‌ఎల్‌ఎస్ ఏరియా పొగాకుకు మార్కెట్‌లో డిమాండ్ పెరిగింది. నాలుగేళ్లగా రికార్డు స్థాయి ధరలు నమోదవుతున్నాయి. ఒకప్పుడు కేజీ పొగాకుకు రూ.190 పలికితే సంతోషపడే రైతాంగానికి వరుస సీజన్‌ల మార్కెట్‌లో రికార్డులు బద్ద లయ్యాయి. ప్రతి ఏడాది మార్కెట్‌లో ధరలు పెరుగుతూ కేజీ పొగాకు రూ.456లకు చేరి ఆల్ టైం రికార్డు నమోదైంది. దీంతో రైతు కుటుంబాలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే పొగాకు సాగు చేసే రైతులు సంఖ్య పెరిగింది. జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి, చల్లావారిగూడెం తదితర గ్రామాల్లో ఎకరం కౌలు ధర రూ.1.10 లక్షలకు చేరిందంటే ఈ సాగుకు ఈ ప్రాంతంలో ఎంత డిమాండ్ ఉందో అర్థం అవుతుంది.

ఆందోళనలో రైతులు...

ఒకప్పుడు ఏజెన్సీ భూములకు విలువేముంది అనుకునే వారు. కానీ ఇప్పుడు ఆ మాటన్న వారంతా ఆశ్చర్యపోతున్నారు. వర్జీనియా పొగాకు ఇక్కడ పరిస్థితినే మార్చేసింది. ఎకరం కౌలు రూ.వేలు నుంచి ఇప్పుడు లక్షల్లోకి చేరింది. 3, 4 సంవత్సరాల క్రితం ఎకరం భూమి రూ.30 వేల నుంచి రూ.35వేలు ఉండేది. అవే భూములు ఇప్పుడు రూ.80వేలకు చేరింది. ఒక బ్యారన్ కౌలుకు రూ.లక్ష ఉండేది ఇప్పుడు రూ.2.50 లక్షల నుంచి రూ.3లక్షలకు చేరింది. రూ.1500 ఉండే టన్ను పుల్ల ప్రస్తుతం రూ.3600 నుంచి రూ.4 వేలకు చేరింది. కూలి ధరలు బాగా పెరిగాయి. ఇలా పెరుగుతూ వెళ్లడం చాలా ప్రమాదకరమని పలువురు అభిప్రాయపడుతున్నారు. మార్కెట్ బాగున్న సమయాల్లో రైతుల మధ్య పోటీతో పెంచిన కౌలు ధరలు మార్కెట్ లేకున్నా తగ్గించడం లేదు.



అమ్మోరు జాతర.. ఏలూరు సెయింట్ డిగ్రీ కాలేజ్ విద్యార్థుల విన్యాసం

యువజనోత్సాహం!

ఏలూరు అర్బన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : స్వామి వివేకానంద జన్మదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర యువజన సర్వీసులు, సాంస్కృతిక వ్యవహారాలశాఖ (సెట్‌వెల్) ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల ఆడిటోరియంలో యువజనో త్సవాలను నిర్వహించారు. జిల్లాలోని పలు జూనియర్, డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలల నుంచి పెద్దసంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. ము ఖ్యఅతిథిగా హాజరైన జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ వివేకానందుని జీవితం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. తొలుత మైనార్టీ సంక్షేమ దినోత్సవాన్ని పురస్కరించుకుని మౌలానా అబుల్‌కలాం అజాద్ చిత్రపటానికి, అనంతరం వివేకానందుని చిత్రపటానికి పూల మాలలువేసి నివాళులర్పిం చారు. సెట్‌వెల్ సీఈవో కె.ఎస్.ప్రభాకరరావు, డీఆర్డీఏ పీడీ విజయరాజు, మైనార్టీ సంక్షేమశాఖ జిల్లా కార్యా లయ సూపరింటెండెంట్ మూర్తి, కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ పాల్గొన్నారు. వివిద సాంస్కృతిక అంశాల్లో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.







అతిథులకు సెయింట్ థెరిస్సా విద్యార్థి స్వాగత నృత్యం.. రామచంద్ర కాలేజీ విద్యార్థుల డ్యాన్స్..



సిద్దార్థ కాలేజీ, నూజివీడు, ఏలూరు సెయింట్ థెరిస్సా విద్యార్థినుల నృత్యం

యువజనోత్సవాల్లో విజేతలు వీరే..

భరతనాట్యం(సోలో)పోటీలో సెయింట్ థెరిస్సా కళాశాలకు చెందిన పి.వసంతలక్ష్మి, ఎస్.సత్యశ్రీ, సీఆర్‌ఆర్ కళాశాలకుచెందిన ఎం.సింధు దుర్గాభవాని విజేతలుగా నిలిచారు. కూచిపూడి(సోలో)పోటీలో ఆదిత్య డిగ్రీ కళాశాలకుచెందిన బి.బృంద, నూజివీడు సిద్దార్థ కళాశాలకు చెందిన లీలాకృష్ణ మనోజ్ఞ, సెయింట్ థెరిస్సా కళాశాలకు చెందిన కె.దామినీసుధ. ఫోక్‌డ్యాన్స్(గ్రూప్)పోటీలో సెయింట్ థెరిస్సా కళాశాలకుచెందిన సత్యశ్రీ బృందం, ఆదిత్య కళాశాలకుచెందిన క్రాంతిశ్రీ బృందం, రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాలకుచెందిన ఆర్య బృందం, గురుకుల పాఠశాలకుచెందిన వెంకటేశ్వరి బృందం. ఇన్నోవేషన్ ట్రాక్ విభాగం సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలో సెయింట్ థెరిస్సా కళాశాలకుచెందిన సీహెచ్.నందిని, ఎస్.అలేఖ్య లిఖితలకు ప్రథమ, రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాలకుచెందిన పి.రోహిణి, ఎం.భువనశ్రీ, వి.పృథ్వి, ఎ.పూజితలకు ద్వితీయ, సీఆర్‌ఆర్ పీజీ కళాశాలకుచెందిన బి.ప్రసన్న, ఎం.రమ్యశ్రీ, టి.నిఖిత, టి.హర్షవర్ధన్‌లకు తృతీయ బహుమతులు లభించాయి. స్టోరీ రైటింగ్ పోటీలో చింతలపూడి ప్రభుత్వ డిగ్రీకళాశాలకుచెందిన ఆర్.సంతోష్, ఏలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకుచెందిన ఎం.సుశాంత్, జంగారెడ్డిగూడెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకుచెందిన కె.బిందుశ్రీ. పెయింటింగ్ పోటీలో సెయింట్ థెరిస్సా కళాశాలకు చెందిన కె.కృపారాణి, ఆదిత్య డిగ్రీ కళాశాలకుచెందిన సీహెచ్.గాయత్రి, ఎస్.దీవెన. డెక్లమేషన్(ప్రసంగం/ ఉపన్యాసం) పోటీలో రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన బి.లోకేష్ మణికంఠ, వి.వైహిత, నూజివీడు సిద్దార్థ కళాశాలకుచెందిన సీహెచ్.నిఖిత. పద్యపఠన (పొయెట్రీ) పోటీలో సెయింట్ థెరిస్సా కళాశాలకుచెందిన డి.రెనీషా, సీఆర్‌ఆర్ కళాశాలకుచెందిన కె.జయఫణీంద్ర, చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకుచెందిన ఆర్.సంతోష్. ఫోక్ సాంగ్(గ్రూప్)పోటీలో సెయింట్ థెరిస్సా కళాశాలకు చెందిన బృంద గ్రూపు, సీఆర్‌ఆర్ జూనియర్ కళాశాలకు చెందిన జి.సాహితి గ్రూపు, సెయింట్ థెరిస్సా జూనియర్ కళాశాలకుచెందిన వందన గ్రూపు. ఇన్‌స్ట్రుమెంట్స్ (వాయిద్య సంగీతం)పోటీలో కైకరం కళాశాలకుచెందిన ఎల్విన్‌రాజు, సీఆర్‌ఆర్ కళాశాలకుచెందిన సాయిస్టాలిన్, ఏలూరు ఇంజనీరింగ్ కళాశాలకుచెందిన సుదాకర్ నరేష్, కన్సొలేషన్ బహుమతులకు ఆదిత్య కళాశాలకుచెందిన కైలాష్, రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాలకుచెందిన ఎఫ్రాయీమ్.

పారా మెడికల్ కోర్సుల మెరిట్ లిస్టు వెల్లడి

ఏలూరు క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పారా మెడికల్ కోర్సులలో ప్రవేశానికి రెండో ఫేజ్ కౌన్సెలింగ్‌కు మెరిట్ లిస్టులు కోర్సుల వారీగా తయారు చేసి, ఆ లిస్టులు ఏలూరు గవర్నమెంట్ మెడికల్ కాలేజీ నోటీసు బోర్డులో ప్రచురించారు. ఈ విషయాన్ని ఏలూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ పి.సావిత్రి మంగళవారం తెలిపారు. కౌన్సెలింగ్ తేదీ ఈ నెల 12గా నిర్ణయించడమైనదన్నారు. కౌన్సెలింగ్ 12వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు గవర్నమెంట్ మెడికల్ కాలేజీ, ఏలూరులో వెరిఫికేషన్ కోసం మెరిట్ లిస్టులో ఉన్న అభ్యర్థులను ఒరిజినల్ సర్టి ఫికెట్స్ తీసుకుని రావలసిందిగా ఆమె కోరారు.



సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు

రైతులను ప్రోత్సహించాలి

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి అత్యంత అవసరమైనది సారవంతమైన మట్టి అని ఆ మట్టిసారం కాపాడే దిశగా రైతులకు మార్గదర్శకత్వం అందించే ఇంటిగ్రేటెడ్ న్యూట్రిషియన్ మేనేజ్‌మెంట్ శిక్షణ అవసరమని జిల్లా కోఆపరేటివ్ అధికారి (అమలాపురం)ఎ.రాధాకృష్ణ పేర్కొన్నారు. వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్‌ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం వద్ద 15 రోజుల ఇంటిగ్రేటెడ్ న్యూట్రిషియన్ మేనేజ్‌మెంట్ శిక్షణ కార్యక్రమం ముగింపు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మరో ముఖ్యఅతిథి విస్తరణ సంచాలకులు డాక్టర్ బి.గోవింద రాజులు మాట్లాడుతూ రైతులంతా మన గ్రామం మన పంట, మన రైతు అనే ఆలోచనతోనే పనిచేయాలన్నారు. ప్రధాన శాస్త్రవేత్త, ప్రోగ్రాం కోఆర్డినేటర్ పి.విజయలక్ష్మి 15 రోజుల శిక్షణపై సమగ్ర వివరణ ఇచ్చారు. అనంతరం శిక్షణలో పాల్గొన్నవారికి సర్టిఫికెట్‌లు అందించారు.

జడ్పీలో ఆరుగురికి ఏవోలుగా పదోన్నతి

ఏలూరు సిటీ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి):ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ యాజమాన్యంలో సీనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న ఆరుగురికి ఏవోలుగా పదోన్నతి కల్పించారు. మంగళవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆరుగురు సీనియర్ అసిస్టెంట్లకు ఏవోలుగా పదోన్నతి ఉత్తర్వులను ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీప్రసాద్, జిల్లా పరిషత్ సీఈవో ఎం.శ్రీహరి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగులు సేవా మార్గంలో చూపిన నిబద్ధతకు గుర్తింపుగా పదోన్నతులు ఇవ్వటం ఎంతో సంతోషకరమైన విషయంగా పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మరింత శ్రద్ధగా, సమర్ధవంతంగా పనిచేయటానికి ఉపయోగించుకోవాలని ఆమె హితవు పలికారు. జిల్లా పరిషత్ సీఈవో ఎం శ్రీహరి మాట్లాడుతూ ఈ పదోన్నతులు ఉద్యోగుల్లో ఉత్సాహాన్ని పెంపొందించ టమే కాకుండా కార్యాలయ పనితీరులోను పాజిటివ్ మార్పులకు దారితీస్తాయన్నారు. జిల్లా పరిషత్ హెచ్ విభాగం ఏవో ఐవీ రాఘవులు పాల్గొన్నారు. జిల్లా పరిషత్ యాజమాన్యం మా శ్రమ ను గుర్తించి ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటామని పదోన్నతి పొందిన ఉద్యోగులు పేర్కొ న్నారు. జడ్పీ చైర్‌పర్సన్‌గా ఘంటా పద్మశ్రీప్రసాద్ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నేటి వరకు మొత్తం 81 మందికి పదోన్నతులు కల్పించారు. ఇందులో ఏవో లుగా 34 మందికి, సీనియర్ అసిస్టెంట్లుగా 31 మంది కి, జూనియర్ అసిస్టెంట్లుగా 6గురికి, రికార్డ్/లైబ్రరీ/ ల్యాబ్ అసిస్టెంట్లుగా 10 మంది ఉద్యోగులకు పదోన్నతులు కల్పించటం జరిగింది.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

ధైర్యవంతుడి కథ



సందీప్‌కిషన్ కథానాయకుడిగా విజయ్ తనయుడు జేసన్ సంజయ్ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. లైకా ప్రొడక్షన్స్ బేనర్‌పై సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టైటిల్‌ను ఖరారు చేసి ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేశారు. 'సిగ్మా' అనేది చిత్ర టైటిల్. 'స్వతంత్ర, ధైర్యవంతమైన వ్యక్తిత్వం గల ఓ వ్యక్తి కథే ఇది. నిధి అన్వేషణ నేపథ్యంలో సాగుతుంది. అద్భుమైన టేకింగ్‌తో రూపొందుతున్న ఈ చిత్రం ప్రేక్షకులకు థ్రిల్లింగ్ అనుభూతిని ఇస్తుంది' అని పేర్కొన్నారు. ఒక్క పాట మినహా చిత్రీకరణ పూర్తయినట్లు తెలిపారు. వేసవిలో చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. ఈ చిత్రానికి ఎడిటర్: ప్రవీణ్ కేఎల్, సినిమాటోగ్రాఫర్: కృష్ణన్ వసంత్, సంగీతం: థమన్.ఎస్.



అబ్బాయిలు క్లాప్స్ కొడుతున్నారు

అనూ ఇమ్మాన్యుయేల్

'ది గర్ల్‌ఫ్రెండ్ సినిమాలో నా పాత్ర కన్నా కథే నన్ను ఎక్కువగా ప్రభావితం చేసింది. ఈతరం అమ్మాయిలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించే మంచి చిత్రమిది. అందుకే హీరోయిన్ పాత్ర కాకపోయినా అంగీకరించాను. కొన్ని సన్నివేశాల్లో నా నటనకు అబ్బాయిలు క్లాప్స్ కొడుతుండడం సంతోషాన్నిస్తోంది' అని అనూ ఇమ్మాన్యుయేల్ అన్నారు. రష్మిక మందన్న లీడ్‌రోల్‌లో నటించిన చిత్రమిది. రాహుల్ రవీంద్రన్ దర్శకుడు. ఇటీవలే విడుదలై చక్కటి ఆదరణతో కొనసాగుతోంది. ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించిన అనూ ఇమ్మాన్యుయేల్ మీడియాతో మాట్లాడారు. ఒక మంచి సినిమాలో భాగమవ్వాలనే ఈ చిత్రంలో నటించాను. ఈ సినిమాను మంచి హిట్‌గా నిలిపిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. ఇందులో దుర్గ అనే పాత్రలో నటించాను. నా వ్యక్తిత్వానికి పూర్తి భిన్నంగా ఉండే పాత్ర కావడంతో ప్రేక్షకులు ఎలా స్పందిస్తారో అని కంగారు పడ్డాను. రాహుల్ నా పాత్రను ప్రత్యేక శ్రద్ధతో తీర్చిదిద్దారు. ఇకపై నటనకు ఆస్కారమున్న కథానాయికల పాత్రలే చేయాలనుకుంటున్నాను' అని ఆమె చెప్పారు.



కుమారి పాత్ర దక్కడం నా అదృష్టం

'కాంత' చిత్రంలో కుమారి పాత్ర చేయడం నా అదృష్టం. ఇది నా కెరీర్‌లో చాలా ప్రత్యేకమైన చిత్రం. రెగ్యులర్ హీరోయిన్ తరహాలో కాకుండా ఇందులో నటనా ప్రాధాన్యమైన పాత్ర దక్కింది' అని కథానాయిక భాగ్యశ్రీ బోర్సే అన్నారు. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన చిత్రమిది. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్‌తో కలసి రానా నిర్మించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సినిమా విశేషాలను భాగ్యశ్రీ బోర్సేమీడియాతో పంచుకున్నారు.

• కెరీర్ ఆరంభంలోనే నాకు కుమారి లాంటి మంచి పాత్ర దొరికినందుకు ఆనందంగా ఉంది.'కాంత' చిత్రంలో నటిగా నాకు సవాల్ విసిరే పాత్రను పోషించాను. 1960ల నాటి నేపథ్యం కావడంతో నా పాత్ర కోసం చాలా సన్నద్ధమవ్వాల్సి వచ్చింది. చాలా కష్టమనిపించింది. శ్రీదేవి, సావిత్రి నటించిన పాత సినిమాలు చూశాను. వారి నటన స్ఫూర్తిగా కుమారి పాత్రను నాదైన శైలిలో ఆవిష్కరించేందుకు ప్రయత్నించాను.

• నేను ఇండస్ట్రీలోకి వచ్చాక తొలిసారి విన్న కథ ఇదే. అయితే చిత్రీకరణలో జాప్యం వల్ల నేను నటించిన ఇతర చిత్రాలు ముందు విడుదలయ్యాయి. దుల్కర్ సల్మాన్, రానాతో నటించడం మరింత ఆనందాన్నిచ్చింది. దర్శకుడు సెల్వ నా పాత్రను తీర్చిదిద్దిన విధానం అద్భుతం.

మా నాన్న బతికే ఉన్నాడు..

-ఈషా డియోల్



బాలీవుడ్ నటుడు ధర్మేంద్ర మరణించారంటూ మంగళవారం వార్తలొచ్చాయి. వీటిని ఆయన కుమార్తె ఈషా డియోల్ ఖండించారు. ఆ వార్తలు అవాస్తవం అని తెలిపారు. తమ కుటుంబం చెప్పేవరకూ ఎలాంటి వదంతులు వ్యాప్తి చేయొద్దని కోరారు. ధర్మేంద్రకు ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రిలో చికిత్స జరుగుతోందని, ప్రస్తుతం ఆయన ఆరోగ్యం బాగానే ఉందన్నారు. ఈ మేరకు ఓ పోస్ట్ పెట్టారు. 'మా నాన్న క్షేమంగానే ఉన్నారు. మేము ప్రస్తుతం ప్రైవసీని కోరుకుంటున్నాం. ఆయన కోలుకోవాలని కోరుకున్నవారందరికీ కృతజ్ఞతలు' అని పేర్కొన్నారు.ఈ ఫేక్ వార్తలపై ధర్మేంద్ర సతీమణి హేమమాలిని స్పందించారు. 'చికిత్స పొందుతూ కోలుకుంటున్న వ్యక్తి గురించి ఇలాంటి వార్తలు రాయడం క్షమించరానిది. బాధ్యత గల మీడియా చానళ్లు ఇలాంటి తప్పుడు వార్తలని ఎలా ప్రచారం చేస్తాయి. ఇది అత్యంత అవమానకరమైన, నిర్లక్ష్యమైన చర్య' అని అసహనం వ్యక్తం చేశారు.



భారీ యాక్షన్ డ్రాప్‌లో

కొత్త తరహా కథాంశంతో తెరకెక్కిన క్రైమ్ థ్రిల్లర్ 'రాబందు'. జయశేఖర్ కల్లు దర్శకత్వంలో పులిజాల సురేశ్ నిర్మించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ నేటి సమాజంలో చర్చనీయాంశంగా మారిన కొన్ని అంశాల ఆధారంగా రాసుకున్న కథతో ఈ చిత్రాన్ని భారీ యాక్షన్ డ్రాప్‌లో తెరకెక్కించాం' అని చెప్పారు. 'చిత్ర నిర్మాణంలో రాజీ పడకుండా భారీ వ్యయంతో నిర్మించాం' అని నిర్మాత చెప్పారు.

నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్



రోడ్ ట్రిప్ నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం గోపీ గాళ్ల గోవా ట్రిప్'. రోహిత్, శశి దర్శకత్వం వహించారు. సాయికుమార్, సీతారామరాజు, రమణారెడ్డి నిర్మించారు. అజిత్ మోహన్, రాజు శివరాత్రి తదితరులు కీలకపాత్రలు పోషించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. మంగళవారం చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ'గతంలో మేము తెరకెక్కించిన లఘు చిత్రాలకు మంచి పేరు వచ్చింది. యువతకు చక్కని సందేశంతోపాటు నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను అందించాలనే లక్ష్యంతో ఈ చిత్రం చేశాం. హాలీవుడ్ తరహా మేకింగ్‌తో ఎంతో కష్టపడి తెరకెక్కించాం' అని చెప్పారు.'కథలో ఊహించని మలుపులు ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేస్తాయి, కొన్నాళ్లపాటు ప్రేక్షకులను వెంటాడే సినిమా ఇది. అన్ని విభాగాలు ఎంతో శ్రమకోర్చి పనిచేసి మంచి అవుట్‌పుట్‌ను రాబట్టాయి' అని నిర్మాతలు చెప్పారు.

ఆస్పత్రిలో చేరిన బాలీవుడ్ విలన్



బాలీవుడ్ సీనియర్ నటుడు, విలన్ పాత్రల పోషణలో తనకంటూ ఓ ప్రత్యేకత ఏర్పరచుకున్న ప్రేమ్ చోప్రా(92) అనారోగ్య కారణాలతో సోమవారం ముంబైలోని లీలావతి ఆస్పత్రిలో చేరారు. వైరల్ ఇన్‌ఫెక్షన్, వయసు రీత్యా వచ్చే ఇబ్బందుల వల్ల ప్రేమ్‌చోప్రా అస్వస్థతకు గురయ్యారనీ, త్వరలోనే ఆయన కోలుకుంటారనీ చికిత్స చేస్తున్న డాక్టర్లు చెప్పారు. 1960-70ల దశకంలో విలన్‌గా ఓ వెలుగు వెలిగారు ప్రేమ్‌చోప్రా. ఆరు పదుల తన నట జీవితంలో ఆయన 380 చిత్రాల్లో నటించారు. సంభాషణలు పలికే తీరు, ఎక్స్‌ప్రెషన్స్‌తో నటుడిగా తన ప్రత్యేకతను చాటుకున్న ప్రేమ్‌చోప్రా బాలీవుడ్‌లోని ప్రముఖ విలన్లలో ఒకరిగా వెలిగారు. 'ఓ కౌన్ థీ'(1954), 'ఉపాకర్(1967), దో రాస్తే (1969), 'కటీ పతంగ్'(1970), బాబీ (1973), దో అంజానే (1976), త్రిశూల్ (1978), దోస్తానా (1980) తదితర చిత్రాల్లో ప్రేమ్‌చోప్రా అభినయం ఇప్పటికీ గుర్తుంటుంది.

నాలుగు తరాల కథ ఇది

- అక్కినేని నాగార్జున



'నాకు పూర్వ జన్మల నేపథ్యంలో తీసిన సినిమాలు చాలా ఇష్టం. అదే సబ్జెక్టుతో వచ్చిన నాన్నగారి 'మూగ మనసులు', నేను నటించిన 'జానకి రాముడు' సూపర్ హిట్ అయ్యాయి. 'గత వైభవం' కూడా నాలుగు తరాల కథ. ఈ సినిమా తీయడానికి ఎంత కష్టపడ్డారో ట్రైలర్ చూస్తూంటే అర్థమవుతోంది. సన్నివేశాలు అద్భుతంగా ఉన్నాయి. సినిమా పెద్ద బ్లాక్‌బస్టర్ కావాలి' అని హీరో నాగార్జున ఆకాంక్షించారు. ఎస్ఎస్ దుష్యంత్, ఆషికా రంగనాథ్ ప్రధాన పాత్రధారులుగా సింపుల్ సుని దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'గత వైభవం'. సర్వెగర సిల్వర్ స్క్రీన్స్, సుని సినిమాస్ బేనర్లపై దీపక్ తిమ్మప్ప, సుని నిర్మించారు. సినిమా ఈనెల 14న విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి నాగార్జున ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హీరో దుష్యంత్ మాట్లాడుతూ 'నాలుగు జన్మలకు సంబంధించిన చిత్రమిది. స్క్రీన్‌ప్లే చాలా కొత్తగా ఉంటుంది' అని తెలిపారు. చిత్రదర్శకుడు సింపుల్ సుని మాట్లాడుతూ 'ఇదొక డిఫరెంట్ జానర్ సినిమా. అన్ని వ్యాపారాంశాలు ఉన్న ప్రయోగాత్మక చిత్రం. ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారనే నమ్మకం మాకుంది' అని అన్నారు.

సంతాన ప్రాప్తిరస్తు విజయం ఖాయం



విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా సంజీవ్ రెడ్డి తెరకెక్కించిన చిత్రం 'సంతాన ప్రాప్తిరస్తు' మధుర ఎంటర్‌టైన్‌మెంట్, నిర్వి ఆర్ట్స్ బేనర్లపై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మించారు. సినిమా ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించింది. దర్శకులు బాబీ, సందీప్ రాజ్,శైలేశ్ కొలను, బీవీఎస్ రవి, నిర్మాత లగడపాటి శ్రీధర్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాబీ మాట్లాడుతూ "సంతాన ప్రాప్తిరస్తు' ట్రైలర్ బాగుంది. ఇలాంటి సున్నిత కథాంశాన్ని అందరికీ నచ్చేలా చెప్పే ప్రయత్నం చేశారు. తప్పకుండా సినిమా మంచి విజయం సాధిస్తుంది' అని అన్నారు. సందీప్‌రాజ్ మాట్లాడుతూ 'నా తొలి సినిమాకు హీరోయిన్ చాందినీ. ఆమె ఒక సినిమా చేస్తుందంటే అందులో కంటెంట్ ఉంటుందనే పేరు తెచ్చుకున్నారు' అని అన్నారు. శైలేష్ కొలను మాట్లాడుతూ 'ఒక సున్నిత కథాంశంతో వినోదాన్ని కలిపి తీసిన చిత్రమిది. గతంలో ఇలాంటి సినిమాలు మంచి విజయం సాధించాయి. ఈ మూవీ కూడా పెద్ద హిట్ అవుతుంది' అని పేర్కొన్నారు. చిత్ర దర్శకుడు సంజీవ్ రెడ్డి మాట్లాడుతూ 'సంతాన సమస్యలు ఉన్న వారు చికిత్స తీసుకోవచ్చు. కానీ అన్నీ బాగుండి లైఫ్ స్టయిల్ వల్ల సంతాన లేమితో బాధపడేవారి గురించి ఈ సినిమాలో చర్చించాం. మంచి ప్రేమ కథ, వినోదంతో పాటు గొప్ప సందేశమూ ఉంటుంది' అని వివరించారు. నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ చిత్రంతో ఒక మంచి ప్రయత్నం చేశాం. విడుదలకు ముందు చిన్న చిత్రం గురించి చెప్పేందుకు ఏమీ ఉండదు, రిలీజ్ అయ్యాక అది సాధించే విజయాలకు అడ్డు ఉండదు' అని అన్నారు.

ముక్కోణపు ప్రేమకథ



గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ఎమోషనల్ డ్రామా రేలుగుంట సూరి'. అనిల్ కుమార్ పల్లా దర్శకుడు. నాగార్జున పల్లా, ఆధ్యారెడ్డి, భావన నీలప్ హీరో హీరోయిన్లుగా నటించారు. సౌమ్యా చాందిని నిర్మించారు. ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మంగళవారం చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్లో అనిల్ కుమార్ మాట్లాడుతూ 'గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ముక్కోణపు ప్రేమకథా చిత్రమిది. మాస్ అంశాలతో పాటు కట్టిపడేసే భావోద్వేగాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి' అని అన్నారు. వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కిన చిత్రమిది అని సౌమ్యా చాందిని తెలిపారు. తెలుగులో అరుదైన, అద్భుతమైన సినిమాగా 'రేలుగుంట సూరి' మిగిలిపోవడం ఖాయం అని నాగార్జున పల్లా చెప్పారు.



స్వామి దర్శనానికి భారీగా తరలివచ్చిన భక్తులు

భక్తులతో కిక్కిరిసిన మద్ది క్షేత్రం

జంగారెడ్డిగూడెం రూరల్, నవంబరు 11, (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం మూడవ మంగళవారం పురస్కరించుకుని మద్ది క్షేత్రం కిటకిటలాడింది. తెల్లవారు జాము నుంచే స్వామి వారి దర్శనార్థం భక్తులు పోటెత్తారు. స్వామి వారికి అత్యంత ప్రీతికరమైన తమలపాకులతో అష్టోత్తర, ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ ప్రదక్షిణలు, అన్నప్రాసన, తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న ఉసిరి చెట్టు వద్ద భక్తులు కార్తిక దీపాలను వెలిగించారు. సుమారు 35వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకోవడంతో ఆలయ ప్రాంగణంతో పాటు క్యూలైన్‌లు, ప్రసాదాల కౌంటర్‌లు కిక్కిరిపోయాయి. దేవస్థాన అన్నదాన సత్రంలో సుమారు 15వేల మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. మంగళవారం ఒక్కరోజే వివిధ సేవల రూపంలో ఆలయానికి రూ.10,34,570 ఆదాయం లభించినట్టు ఆలయ ఈవో చందన తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ, ఘంటా సత్యంబాబు, మానిరెడ్డి గాంధీ, వెంకటరామ మోహనరావు, ఫణీంద్ర ఆధ్వర్యంలో అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. జంగారెడ్డిగూడెం ఏఎస్పీ సుష్మిత రామనాథన్ బందోబస్తును పర్యవేక్షించారు.

ఆసక్తికరంగా టెన్నిస్ పోటీలు



పాలకొల్లు టౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక కాస్మోకల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరుగుతున్న బుద్దావ తారం మెమోరియల్ ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ పోటీలు 2వ రోజు మంగళవారం ఆసక్తికరంగా సాగాయి. పోటీలు పాలకొల్లులో 2 కోర్టులు, నరసాపురంలో 2కోర్టుల్లో జరుగుతున్నాయి. 45, 55, 65, 70 సీనియర్స్ విభాగాలుగా పోటీలు నిర్వహిస్తున్నట్టు ఆర్గనైజింగ్ కార్యదర్శి గొట్టుముక్కల భూన్‌రాజు వెల్లడించారు.

నెట్‌బాల్‌లో గొరగనమూడి విద్యార్థుల ప్రతిభ



ప్రతిభకనబర్చిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పాలకోడేరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్ -17 నెట్‌బాల్ పోటీల్లో గొరగనమూడి హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీదేవి తెలిపారు. విజయవాడలోని పటమట హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో ఈ నెల 8వ తేదీ నుంచి 10 వరకు జరిగిన 69వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్ -17 నెట్ బాల్ పోటీల్లో పశ్చిమగోదావరి జిల్లా బాలికల జట్టు మొదటి స్థానం, బాలురు ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నాయి. ఈ జట్లలో గొరగనమూడి స్వామి జ్ఞానానంద హైస్కూల్ విద్యార్థినిలు డి. జ్యోత్స్న, నాగసాయి, కె.గుణవర్షిత, ఏ.పోషిత, టి. మహాలక్ష్మి, పి.శృతి ప్రతిభ కనబరిచారన్నారు. బాలుర విభాగంలో ఎస్.మహేష్, కె.లోకేష్, జి.సురేష్, ఏ.ప్రవీణ్‌కుమార్, బి.రమేష్, బి.మున్నా ప్రతిభ కనబర్చారన్నారు.

సివిల్ సర్వీస్ ఉద్యోగుల క్రీడా జట్ల ఎంపిక



డిస్కస్ త్రోలో పాల్గొన్న ఉద్యోగి

ఏలూరు రూరల్, నవంబరు 11, (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడాప్రాధికార సంస్థ (డీఎస్ఏ) ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి సివిల్ సర్వీస్ ఉద్యోగుల క్రీడా జట్ల ఎంపిక పోటీల్లో పలువురు ఉద్యోగులు ఉత్సాహంగా తలపడ్డారు. రెండు రోజుల పాటు పలు క్రీడాంశాల్లో జరుగుతున్న జట్ల ఎంపిక పోటీల్లో భాగంగా మొదటి రోజు ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో టెన్నిస్, టేబుల్ టెన్నిస్ కబడ్డీ, ఫుట్‌బాల్, పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్, చదరంగం, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, క్యారమ్స్, బిశ్వనాథ్ భర్తియా స్విమ్మింగ్‌పూల్‌లో స్విమ్మింగ్, పోటీలు నిర్వహించారు. పోటీలను శాప్ నియమించిన శిక్షకుల పర్యవేక్షణలో రాష్ట్ర సివిల్ సర్వీస్ ఉద్యోగుల క్రీడా జట్ల ఎంపికలు నిర్వహించామని జిల్లా క్రీడాభివృద్ధి (డిఎస్‌డివో) ఎస్ఏ అజీజ్ తెలిపారు. ఎంపిక పోటీలకు 150 మంది ఉద్యోగులు పాల్గొనగా ఆయా క్రీడల్లో 91 మందిని ఎంపిక చేసినట్లు అజీజ్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఎన్టీఆర్ జిల్లాలో ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి సివిల్ సర్వీస్ ఉద్యోగుల క్రీడాపోటీల్లో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.



క్రీడాకారులతో వ్యాయామ ఉపాధ్యాయురాలు పద్మావతి

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌టెన్నిస్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

లింగపాలెం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి అండర్ 14, అండర్ 17 సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు లింగపాలెం మండ లం కలరాయనగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన హర్ష, జయంత్, చైతన్య, ఎబినేజర్, అనిల్, ఈశ్వరాచార్యులు ఎంపిక య్యారు. ఈ నెల 11, 12, 13 తేదీల్లో జరిగే సాఫ్ట్ టెన్నిస్ పోటీల్లో పాల్గొనను న్నారని వ్యాయామ ఉపాధ్యాయురాలు పద్మావతి తెలిపారు. సాఫ్ట్ టెన్నిస్ పోటీల అనంతరం పాతపట్నం ఎమ్మెల్యే గోవిందరావు వీరిని అభినందించారు.

బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించాలి : ఏఎస్పీ

ఏలూరు క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మహిళా సంరక్షణ కార్యదర్శులు తమ బాధ్యతలను మరింత సమర్థవంతంగా, చట్ట బద్దంగా నిర్వహించాలని జిల్లా అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం గ్రామ, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులతో సదస్సు నిర్వహించారు. ఉద్యోగ నిర్వహణపై కీలక మార్గదర్శకాలను తెలియజేయడానికి ఈ సదస్సు ఏర్పాటు చేశారు. అదనపు ఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు మాట్లాడుతూ ప్రతి సచివాలయం పరిధిలో ఉద్యోగ నిర్వహణలో ఏ పనులు చేయాలో, ఏవి చేయకూడదో స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నాయని వాటిని అనుసరించి విధులు నిర్వర్తించాలన్నారు. తమ పరిధిలో ప్రతి ఇంటిని సందర్శిస్తూ ముఖ్యంగా మహిళలు, పిల్లలు, వృద్ధుల భద్రతను పర్యవేక్షించాలన్నారు. బాలికలకు పోక్సో, దిశ యాప్, సైబర్ నేరాలు, గృహ హింస చట్టాలపై నిరంతరం అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. సచివాలయ స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

జంగారెడ్డిగూడెం,నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం ఏఎస్పీ సుస్మిత రామనాథన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఎస్సీ పేటలోని శ్మశానవాటికలో పేకాట స్థావరంపై పోలీసులు దాడులు చేశారు.ఈ దాడుల్లో ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.21వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో సీఐ సుభాష్, ఎస్సై వీరప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

పంటలకు మెరుగైన ధరే ఫుడ్ ప్రాసెసింగ్ లక్ష్యం

- ప్రతి మండలంలోనూ 'నైబర్హుడ్ వర్క్ ప్లేస్' ఏర్పాటు
- పొలాల్లో సోలార్ విద్యుత్ ఏర్పాటుతో రైతులకు అదనపు ఆదాయం

మొర్సిపూడిలో రూ.102 కోట్లతో ఫుడ్‌పార్కు పనులకు మంత్రి పార్థసారథి శంకుస్థాపన



మొర్సిపూడి సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

నూజివీడు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి):రైతులు తాము పండించే పంటలకు మెరుగైన ధరను కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ లక్ష్యమని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ప్రకాశం జిల్లా కనిగిరిలో రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు 60 పారిశ్రామిక ప్రాజెక్టులు, 51 మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్‌ఎంఈ)ల ప్రారంభోత్సవంలో భాగంగా నూజివీడు మండలం మొర్సిపూడిలో రూ.102 కోట్లతో ఏర్పాటు చేసే రమణ్‌సింగ్ గ్లోబల్ ఫుడ్‌పార్క్ పనులను మంగళవారం వర్చువల్‌గా శంకుస్థాపన చేయగా, మొర్సిపూడిలో మంత్రి పార్థసారథి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశ ప్రధాని మోదీ సహకారంతో రాష్ట్రాన్ని వ్యవసాయపరంగా, ఆర్థికంగా, పారిశ్రామికంగా దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపేందుకు విజన్ కలిగిన నాయకుడు రాష్ట్ర సీఎం చంద్రబాబునాయుడు అలుపెరగని కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు 20 కొత్త పారిశ్రామిక పాలసీలు తీసుకువచ్చామని, అందులో ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ ఒకటన్నారు. . రమణ్‌సింగ్ గ్లోబల్ ఫుడ్‌పార్క్ ఏర్పాటు ద్వారా 700 మంది యువతకు ప్రత్యక్షంగా, 1500 మందికి పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. ఈనాటి యువత ఉద్యోగం కోసం నిరీక్షించడం నుంచి మరొకరికి ఉద్యోగం అందించే స్థాయికి తీసుకెళ్లడమే స్వర్ణాంధ్ర-2047 విజన్ లక్ష్యమన్నారు. రాష్ట్రంలో వర్క్ ఫ్రమ్ హోమ్ చేసే సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల కోసం ప్రతీ మండలంలోనూ 'నైబర్హుడ్ వర్క్ ప్లేస్' రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసే ఆలోచనలో ఉందన్నారు. పంట పొలాల్లో సాగుకు అడ్డులేకుండా సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసి, రైతులకు మరింత ఆదాయం అందించేలా ప్రభుత్వం ఆలోచన చేస్తుందన్నారు. నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి విజన్ స్వర్ణాం ధ్ర- 2047 సాధనలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. రాష్ట్ర చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు భాస్కరరావు, విజయ మిల్క్ డైరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు, ఎంపీపీ శిరీష ప్రముఖులు ప్రసంగిం చారు. ఈ సందర్భంగా పారిశ్రామికవేత్తకు ప్రభుత్వ ప్రోత్సాహ కాల చెక్కును మంత్రి అందించారు. అనంతరం మంత్రిని రమణ్‌సింగ్ గ్లోబల్ ఫుడ్ పార్కు యాజమాన్యం గోగినేని బాబు, గోగినేని పద్మావతి, బాలాజీ సత్కరించారు. జిల్లా పరిషత్ సీఈవో శ్రీహరి, గృహనిర్మాణశాఖ పీడీ సత్యనారాయణ, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ బాబ్జి పాల్గొన్నారు.

సీహెచ్ పోతేపల్లిలో ఆగ్రోవెట్‌కు శంకుస్థాపన

- ఆయిల్‌పాం దిగుబడిలో మలేషియాతో పోటీపడడం గర్వకారణం : ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల

ద్వారకా తిరుమల : మలేషియాతో పోటీ పడుతూ ఏలూరు జిల్లా రైతాంగం ఆయిల్‌పాం దిగుబడిని సాధించడం రాష్ట్రానికి గర్వకారణమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ కోరారు. పరిశ్రమలు ఉపాధి కల్పనలో భాగంగా మండలంలోని సీహెచ్ పోతేపల్లిలో మంగళవారం సీఎం చంద్రబాబు వర్చువల్‌గా గోద్రేజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ పరిశ్రమ శంకుస్థాపన కార్యక్రమానికి మంగళవారం ఆయన హాజరయ్యారు. ఆయనతో పాటు ఉంగుటూరు, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యేలు పత్సమట్ల ధర్మరాజు, బొలిశెట్టి శ్రీనివాస్, కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జనసేన నేతలు పాల్గొన్నారు. తొలుత ఆయిల్‌పాం ఫాక్టరీకి విచ్చేసిన ఆయనకు అక్కడి సీఈవో, ఇతర అధికారులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ఆయిల్‌పాం ఫ్యాక్టరీని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయల్‌పాం గెలల నాణ్యతను, వాటి నుంచి క్రూడ్ ఆయిల్ తయారయ్యే విధానాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం నూతనంగా రూ.210కోట్లతో నిర్మించనున్న పరిశ్రమ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడూతూ ఈ పరిశ్రమ నిర్మాణం వచ్చే మార్చి నాటికి పూర్తవుతుందన్నారు. పరిశ్రమల స్థాపన ద్వారా యువతకు మంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి అన్ని విధాలా సహాయసహకారాలు అందిస్తామని ఔత్సాహిక పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలని కోరారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం : ఎమ్మెల్యే చంటి



ఏలూరులో ఎంఎస్ఎమ్ఈ పార్కు శంకుస్థాపనలో భాగంగా జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే బడేటి చంటి, తదితరులు

ఏలూరుటూటౌన్ : ఔత్సాహికులైన యువ పారిశ్రామికవేత్తలను అన్నివిధాలా ప్రోత్సహిస్తూ పరిశ్రమల స్థాపనే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు వెళ్తుందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఏలూరు ఏఎస్ఆర్ స్టేడియంలో ఏపీ ఎంఎస్ఎంఈ అండ్ ఇంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ పాలసీలో భాగంగా 2.2 ఎకరాల్లో రూ.14 కోట్లతో ఏర్పాటు చేయనున్న ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్, పారిశ్రామికవాడ నిర్మాణ పనులను మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ప్రకాశం జిల్లాలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎస్ఎంఎస్ఈ ప్రోగ్రాంకు శంకుస్థాపన చేసే కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. అనంతరం ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ ఉన్నత విద్యావంతులు స్వశక్తితో స్వయం సమృద్ధి సాధించేందుకు కూటమి ప్రభుత్వం అవసరమైన ఎన్నో అవకాశాలు కల్పిస్తుందన్నారు. వీటిని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నగరం నడిబొడ్డులో పార్కు ఏర్పాటుకు అనువైన స్థలం లభించడం నగరప్రజల అదృష్టమన్నారు. చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు యువత ముందుకు రావాలన్నారు. చిన్నతరహా పరిశ్రమల ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు రవాణా సౌకర్యం మెరుగుపడతుందన్నారు. ఇడా చైర్మన్ శివప్రసాద్, ఏఎంసీ చైర్మన్ పార్థసారథి ఏపీ ఈపీడీసీఎల్ ఎస్ఈ సాల్మన్‌రాజు, ఆర్డీవో అచ్యుత అంబరీష్, మున్సిపల్ కమిషనర్ భానుప్రతాప్, తహసీల్దార్ గాయిత్రీదేవి తదితరులు పాల్గొన్నారు.





షేక్ షకీలాబేగం

విజయవాడలో మంత్రి ఫరూక్‌నుంచి పురస్కారాన్ని అందుకుంటున్న తస్లీం సుల్తానా



సిరాజ్



అన్వర్‌జహాన్

రాష్ట్ర ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయ అవార్డుల అందజేత

ఏలూరు అర్బన్, నవంబరు11(ఆంధ్రజ్యోతి):భారతరత్న మౌలానా అబుల్‌కలాం అజాద్ 138వ జయంతిని పురస్కరించుకుని ప్రభుత్వం అందజేసే ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయ అవార్డులకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఎంపికైన ఆరుగురికి మంగళవారం రాత్రి విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో రాష్ట్ర మైనార్టీస్ సంక్షేమశాఖ నిర్వహించిన కార్యక్రమంలో పురస్కారాలను అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మైనార్టీస్ సంక్షేమశాఖ మంత్రి ఎన్.ఎం.డి.ఫరూక్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమ, ఏపీ ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షేక్ మొహమ్మద్ గౌస్ పీర్, ప్రభుత్వ కార్యదర్శి చిత్తూరి శ్రీధర్, తదితరులు అవార్డుల అందజేత కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలుత కొందరికి పురస్కారాలను సీఎం అందజేసివెళ్లిపోగా, మిగతావారికి మంత్రి ఫరూక్ అందించారు. ఏలూరు జిల్లా నుంచి ఏలూరులోని మౌలానా అబుల్‌కలాం అజాద్(మాకా)ఉర్దూ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్ ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న షేక్ షకీలాబేగం, ఉంగుటూరు మండలం చేబ్రోలు ఉర్దూ ప్రాథమి కోన్నత పాఠశాలలో ఎస్టీటీలుగా పనిచేస్తున్న తస్లీం సుల్తానా, ఎండి.సనావుల్లా షరీఫ్, కైకలూరు మండలం కొత్తపేట ఉర్దూ ప్రాథమి కోన్నత పాఠశాలలో ఎస్జీటీగా పని చేస్తున్న హసీనా సుల్తానా, ఏలూరు రూరల్ మండలం శనివారపుపేట ఉర్దూ ప్రాథమి కోన్నత పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న ఎస్కే.అన్వర్ జహాన్‌లకు రాష్ట్ర ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయ అవార్డులను అందజేశారు. పశ్చిమ గోదావరి జిల్లా నుంచి తాడేపల్లిగూడెం సంజీవరెడ్డినగర్ ప్రాథమి కోన్నత పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న ఎండి.సిరాజ్ రాష్ట్ర ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకున్నారు. జిల్లాలో ఉర్దూ భాషాభివృద్ధికి కృషిచేస్తున్నందుకు గాను ఆరుగురు ఉర్దూ ఉపాధ్యాయులకు రాష్ట్ర అవార్డులు లభించడం పట్ల డీఈవో వెంకటలక్ష్మమ్మ, ఉర్దూ పాఠశాలల ఉపతనిఖీ అధికారి ఆసిఫ్ హర్షం వ్యక్తం చేశారు. అవార్డు గ్రహీతలను అభినందించారు.

అదనపు కట్నం కేసులో భర్తకు 15 నెలల జైలు

ఇరగవరం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం భార్యను వేధించిన వ్యక్తికి 15 నెలలు జైలు శిక్ష, రూ.4,500 జరిమానా విధించినట్టు ఇరగవరం ఎస్ఐ జానా సతీశ్ తెలిపారు. ఇరగవరం మండలం రేలంగి గ్రామానికి చెందిన బాదంపూడి సునీత రాణికు తాడేపల్లిగూడెం పాతూరుకు చెందిన బాదంపూడి శ్రీనివాస్‌తో 2004 సంవత్సరంలో వివాహం జరిగింది. వివాహ సమయంలో ఇచ్చిన కట్నం సరిపోలేదని అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తుండడంతో బాదంపూడి సునీత రాణి భర్త బాదంపూడి శ్రీనివాస్‌పై ఇరగవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ జానా సతీష్ కేసు నమోదు చేసి చార్జి షీటు దాఖలు చేశారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ ఈ హనుమంతరావు నేరాన్ని రుజువు చేశారు. దీంతో బాదంపూడి శ్రీనివాస్‌కు శిక్ష విధిస్తూ కోర్టు న్యాయమూర్తి పి.వి.నాగరంజిత్ కుమార్ మంగళవారం తీర్పునిచ్చారు.

మహిళను మోసగించిన కేసులో ఒకరి అరెస్టు

పోలవరం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి):మహిళకు మాయమాటలు చెప్పి మోసగించిన కేసులో ప్రగడపల్లి గ్రామానికి చెందిన బడేటి శ్రీనివాసరావు అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండుకు పంపినట్టు ఎస్ఐ ఎస్.పవన్‌కుమార్ మంగళవారం తెలిపారు. ప్రగడపల్లి గ్రామానికి చెందిన మహిళను మాయ మాటలతో లోబరుచుకుని మోసం చేసినట్టు బాధిత మహిళ ఇచ్చినట్టు ఎస్ఐ తెలిపారు.అందిన ఫిర్యాదు మేరకు భారతీయ న్యాయ సంహిత నూతన చట్టం సెక్షన్ 69 కింద కేసు నమోదు చేసి జంగారెడ్డిగూడెం కోర్టు ముందు హాజరు పరచగా 14 రోజులు రిమాండు విధించినట్టు తెలిపారు.

బుల్లెట్ డిక్కీలో దాచిన రూ.2 లక్షలు చోరీ

నరసాపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పంజా సెంటర్‌లో మంగళవారం బుల్లెట్ డిక్కీలో దాచిన రూ.2 లక్షలను కేటుగాళ్లు కొట్టేశారు. మండలంలోని వేములదీవి గ్రామానికి చెందిన ఉంగరాలు శ్రీనివాస్ పట్టణంలోని ఓ జాతీయ బ్యాంకులో రూ.2 లక్షలు సొమ్మును డ్రా చేసి బుల్లెట్ ట్యాంకు కవర్‌లో దాచాడు. ఇంటికి తిరిగి వెళ్తూ పంజా సెంటర్‌లోని ఓ హోటల్ వద్ద ఆగి టిఫిన్ చేసి బయటకు వచ్చే సరికే మోటార్ సైకిల్ కవర్‌లోని డబ్బులు కనిపించలేదు. హోటల్ వద్ద ఉన్న సీసీ కెమేరాలు పరిశీలించగా టోపీ పెట్టుకున్న ఓ వ్యక్తి ఈ చోరీకి పాల్పడినట్టు గుర్తించారు. వెంటనే పట్టణ పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసినట్టు ఎస్.ఐ. జయలక్ష్మి చెప్పారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

నరసాపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వెండి చోరీ కేసులో తప్పించుకు తిరుగుతున్న వై.నాగేశ్వరరావును మంగళవారం మాదవాయిపాలెం రేవులో అరెస్టు చేసినట్టు ఎస్.ఐ. జయలక్ష్మి తెలిపారు. మార్చిలో పట్టణంలో ఐదు కేజీల వెండి చోరి జరిగింది. ఈ కేసులో ఇద్దరిని ఇప్పటికే అరెస్టు చేసినట్టు ఎస్.ఐ. చెప్పారు. ఎప్పటినుంచో తప్పించుకు తిరుగుతున్న అతడిని తాజాగా అరెస్టు చేశామన్నారు.

చికిత్స పొందుతున్న ఆటో డ్రైవర్ మృతి

ప్రమాదానికి కారణమైన మరో ఆటో డ్రైవర్‌పై కేసు

ఏలూరు క్రైం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రెండు ఆటోలు ఎదురెదురుగా ఢీ కొన్న ఘటనలో తీవ్ర గాయాలకు గురైన ఆటో డ్రైవర్ విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఏలూరు రూరల్ మండలం బూరాయిగూడెం గ్రామానికి చెందిన కర్రా ఫ్రాన్సిస్(57) ఆటో డ్రైవర్‌గా జీవిస్తు భార్య ఇద్దరు మనుమళ్లను పోషిస్తున్నాడు. ఈ నెల 6వ తేదీన ఏలూరు నుంచి చింతలపూడికి కర్రా ఫ్రాన్సిస్ తన ఆటో వేసుకుని వెళ్తుండగా ఏలూరు సమీపంలోని వంగూరు బ్రిడ్జి వద్ద ఎదురు వచ్చిన మరో ఆటో ఢీ కొట్టింది. ఈప్రమాదంలో కర్రా ఫ్రాన్సిస్ తీవ్ర గాయాలకు గురి కాగా అతడిని ఏలూరు ప్రభుత్వానుపత్రిలో చేర్పించారు. మెరుగైన చికిత్స కోసం విజయవాడ తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటనపై ఏలూరు త్రి టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో మంగళవారం ఫ్రాన్సిస్ మృత దేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. ప్రమాదానికి కారణమైన ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసి చేశారు.

వేర్వేరు కేసుల్లో ఇద్దరి అరెస్టు



కేసుల వివరాలు వెల్లడిస్తున్న ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్

ఏలూరు క్రైం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మద్యం,డబ్బులు విషయంలో స్నేహితుల మధ్య మనస్పర్థలు రావడంతో కక్ష పెంచుకునిచాకుతో పొడిచి హతమార్చిన నిందితుడ్ని అరెస్టు చేశామని ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ చెప్పారు. మంగళవారం సాయంత్రం ఏలూరు డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను డీఎస్పీ వెల్లడించారు. ఏలూరు రూరల్ మండలం వెంకటాపురం పంచాయతీ గణేష్ కాలనీకి చెందిన నమ్మి హరి కృష్ణ(31) అదే ప్రాంతంలోని మూడో రోడ్డునకు చెందిన నాయక్ దీపక్(31), మామిడి నానిలు స్నేహితులు ఈ ముగ్గురు కలిసి మద్యం తాగుతూ స్నేహంగా ఉంటారు. ఈ ముగ్గురి మధ్యం, డబ్బుల విషయంలో గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో నమ్మి హరికృష్ణపై నాయక్ దీపక్ కక్ష పెంచుకున్నాడు. ఈ నెల 7న హరికృష్ణను పొడిచి నాయక్ దీపక్ పారిపోయాడు. ఈ ఘటనపై ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. మోటారు సైకిల్‌పై పెదపాడు నుంచి ఏలూరు వస్తున్న నాయక్‌దీపక్‌ను మంగళవారం ఉదయం పోలీసులు అరెస్టు చేశారు. మోటారు సైకిల్, చాకును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, వన్ టౌన్ సీఐ జి.సత్యనారాయణ, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం.సుబ్బారావు, రూరల్ ఎస్ఐ బి నాగబాబులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా వేధింపుల్లో మరొకరు..

సోషల్ మీడియా ద్వారా యువతులను పరిచయం చేసుకుని ప్రేమ, పెళ్లి పేరుతో వారిని మాయమాటలతో దగ్గర చేసుకుని అశ్లీల వీడియోలు, కాల్స్‌ను చేసి రికార్డింగ్ చేసి బెదిరింపులకు పాల్పడుతున్న ఒక యువకుడిని అరెస్టు చేసినట్టు ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ చెప్పారు. ఏలూరు గ్రేవియర్ నగర్ ఏటిగట్టు ప్రాంతానికి చెందిన వెంపటి జస్విన్(20) సోషల్ మీడియా ద్వారా యువతలను పరిచయం చేసుకుని వారితో దిగిన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో పెడతానని, తల్లిదండ్రులకు కూడా పంపించి బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు, బంగారం తీసుకున్న జస్విన్‌పై ఫిర్యాదు రావడంతో మంగళవారం అరెస్టు చేసినట్టు చెప్పారు. ఎవరైనా బాధితులుంటే ధైర్యంగా ఫిర్యాదు చేయాలని వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఏలూరు డీఎస్పీ చెప్పారు. సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులతో పరిచయాలు చేసుకోకూడదని సూచించారు. మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం.సుబ్బారావు, ఎస్ఐ నాగమణి పాల్గొన్నారు.

ఆటో మేటిక్ పనుల కారణంగా రైళ్ల రద్దు



ఏలూరు క్రైం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే శాఖ పరిధిలోని విజయవాడ - దువ్వాడ మధ్యలో ఉన్న తుని, హంసవరం, అన్నవరం, రావికంపాడు స్టేషన్ల పరిధిలో ఆటో మేటిక్ రైల్వే పనులు నిర్వహిస్తున్న నేపథ్యంలో నాలుగు రైళ్లను ఈనెల 20న రద్దు చేశారు. రైల్ నెంబర్ 17267 కాకినాడ పోర్టు - విశాఖపట్టణం, రైల్ నెంబర్ 17268 విశాఖ పట్టణం - కాకినాడ పోర్టు, రైల్ నెంబర్67285 రాజమండ్రి - విశాఖ, 67286 విశాఖ - రాజమండ్రి వెళ్లే రైళ్లను ఈనెల 20న రద్దు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రకటించారు.

ప్రత్యేక రైళ్లు : ప్రయాణికుల రద్దీ దృష్ట్యా రెండు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు దక్షిణ మధ్య రైల్వే శాఖ వెల్లడించింది. రైల్ నెంబర్ 07455 నర్సాపురం -సికింద్రాబాద్ ఈ నెల 12వ తేదీ సాయంత్రం 6.30 గంటలకు నర్సాపురంలో బయల్దేరి మరుసటి రోజు ఉదయం 5 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. రైల్ నెంబర్ 07179 అనకాపల్లి - సికింద్రాబాద్ వెళ్లే రైలు ఈ నెల 15వ తేదీ సాయంత్రం 5.35 గంటలకు అనకాపల్లిలో బయల్దేరి మరుసటి రోజు ఉదయం8 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుందన్నారు. రైల్ నెంబర్ 07485(నర్సాపురం - సికింద్రాబాద్) రైలు పాలకొల్లు, భీమవరంటౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ జంక్షన్, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ మీదుగా నడుస్తుందన్నారు. ఈ రైలులో టూటైర్ ఏసీ, త్రి టైర్ ఏసీ, స్లీపర్ అండ్ జనరల్, సెకండ్ క్లాస్ కోచ్‌లు అందుబాటులో ఉంటాయన్నారు. రైల్ నెంబర్ 07179(అనకాపల్లి- సికింద్రాబాద్)ఈ రైలు తుని అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ళ, మిర్యాలగూడ, నల్గొండ, చర్లపల్లి రైల్వే స్టేషన్లలో ఆగుతుందన్నారు. ఈ రైల్‌లో ఫస్ట్ క్లాస్ ఏసీ, సెకండ్ క్లాస్ ఏసీ, త్రి టైర్ ఏసీ, స్లీపర్, జనరల్, సెకండ్‌క్లాస్ కోచ్‌లు ఉంటాయన్నారు.

ప్రత్యేక రైళ్లు పొడిగింపు: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా నడుపుతున్న రెండింటిని జనవరి 22వ తేదీ వరకూ పొడిగిస్తున్నట్టు దక్షిణ మధ్య రైల్వే శాఖ అధికారులు తెలిపారు. రైల్ నెంబర్ 07219 నర్సాపురం - తిరువన్నమలై ప్రతి బుధవారం నడిచే ఈ రైలు డిసెంబరు 3 నుంచి వచ్చే ఏడాది జనవరి 21 వరకు పొడిగించినట్లు తెలిపారు. రైల్ నెంబర్ 07220 తిరువన్నమలై - నర్సాపురం ప్రతి గురువారం నడిచే ఈ రైలు డిశంబరు 4 నుంచి వచ్చే ఏడాది జనవరి 22 వరకూ పొడిగించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

భీమడోలు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రోడ్డుపై ఉంచిన ధాన్యం రాసిని ఢీకొని కింద పడి తీవ్ర గాయాలైన యువకుడు మృతి చెందిన ఘటన భీమడోలులో చోటు చేసుకుంది. భీమడోలు శివారు సూర్యాపేటకు చెందిన షేక్ సయ్యద్ బాజీ(25)ఈనెల 4న సూరప్పగూడెం జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో వెళ్తుండా గమనించకుండా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో సయ్యద్ బాజీ తలకు తీవ్ర గాయాలవడంతో ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తరలించగా మంగళవారం ఉదయం మృతి చెందాడు. భీమడోలు పోలీసులు కేసు నమోదు చేశారు.

బెల్ట్ షాపులపై దాడులు

లింగపాలెం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలో ఎన్‌ఫోర్స్‌మెంట్, ఏలూరు, చింతలపూడి ఎక్సైజ్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో సారా, బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించినట్టు చింతలపూడి ఎక్సైజ్ సీఐ పి.అశోక్ తెలిపారు. ధర్మాజీగూడెంలో అక్రమంగా బెల్ట్ షాపు నిర్వహిస్తున్న మహిళను అదుపులోకి తీసుకుని ఆమె నుంచి 19 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని ఆమెపై కేసు నమోదు చేశామన్నారు. వేములపల్లిలో సారా కేసులో నిందితురాలుగా ఉన్న ఒక మహిళను తహసీల్దార్ నజీముల్లాషా వద్ద బైండోవర్ చెయ్యగా తహసీల్దార్ ఆమెకు రూ.3 వేల జరిమానా విధించినట్టు తెలిపారు. ఈ దాడుల్లో ఏలూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఫణి కుమార్, ఏలూరు ఎస్ఐ గౌరీశంకర్, చింతలపూడి ఎస్ఐ అబ్దుల్‌ఖలీల్ పాల్గొన్నారు.

బస్సు ఢీకొని మహిళకు గాయాలు

ఏలూరు క్రైం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): తోపుడు బండిపై ముగ్గు అమ్మే మహిళను కళాశాల బస్సు ఢీకొనడంతో తీవ్ర గాయాలకు గురైంది. ఏలూరు ఎమ్మార్సీ కాలనీకి చెందిన గోగుల మరియమ్మ తోపుడు బండిపై ముగ్గు అమ్ముకుంటూ జీవిస్తోంది.ఈనెల 10న తోపుడు బండిపై ముగ్గు అమ్ముకోవడానికి బండిని తోసుకెళ్తుండగా తంగెళ్ళమూడి బ్రిడ్జి వద్ద రామచంద్ర ఇంజనీరింగ్ కాలేజీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురైన ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం చికిత్స పొందుతోంది. ఈ సంఘటనపై ఏలూరు టూటౌన్ సీఐ కె.అశోక్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేశారు.

సీసలిలో చెట్టును ఢీకొట్టిన వ్యాన్

కాళ్ళ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రొయ్యల వ్యాన్ వేగంగా వచ్చి చెట్టును ఢీకొట్టిన ఘటన మంగళవారం సీసలిలో చోటుచేసుకుంది. భీమవరం నుంచి ప్రాతాళ్లమెరక వెళ్తున్న రొయ్యల వ్యాను సాయిబాబా గుడి సమీపంలో గుంతలో పడి వ్యాన్ స్టీరింగ్ వదిలేయడంతో అదుపు తప్పి మురుగుబోదె వైపు దూసుకెళ్లింది. డ్రైవర్ అప్రమత్తమవడంతో బోదె గట్టు మీద ఉన్న చెట్టును ఢీకొని ఆగింది. వ్యాను బోదెలోకి వెళ్లక పోవడంతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. వ్యాన్ నడుపుతున్న డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. కొంత సమయానికి క్రేన్ సహాయంతో వ్యాన్‌ను బయటకు తీశారు.

సుబ్రహ్మణ్య స్వామికి వైభవంగా కావిడి ఉత్సవం

నిడమర్రు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): భువనపల్లిలో ఉన్న దేవసేన సుబ్రహ్మణ్య స్వామికి కావిడి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. తమిళనాడు పళణి సుబ్రహ్మణ్యస్వామికి భక్తులు సమర్పించే కావడి ఉత్సవం మాదిరి భువనపల్లి గ్రామంలో తొలిసారి భక్తులు కావిడిలో పాలు, పెరుగు తీసుకుని గ్రామంలో అన్ని దేవాలయాలను సందర్శించి చివరగా సుబ్రహ్మణ్యస్వామికి కావిడిలతో కూడిన ఆవుపాలు, ఆవుపెరుగు సమర్పించి అభిషేకం చేశారు. ఈ ఉత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారికి కావిడిలు సమర్పించారు.

విద్యా సంస్థల్లో నేడు మూర్తిరాజు వర్ధంతి

నిడమర్రు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యాదాత, సర్వోదయ నాయకులు చింతలపాటి వరప్రసాద మూర్తి రాజు 13వ వర్ధంతిని జిల్లా వ్యాప్తంగా ఆయన నెలకొల్పిన అన్ని విద్యా సంస్థల్లో నిర్వహిస్తున్నట్టు సర్వోదయ మండలి ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. పెదనిండ్రకొలను గాంధీ భవన్‌లో వర్ధంతి జరుగుతుందని, అంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. విద్యాభివృద్ధికి విశేష కృషి చేసిన ఆదర్శ మూర్తిని తలుచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికీ ఉందని ఆయన పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు సద్వినియోగించుకోవాలి

జీలుగుమిల్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రైతులు కష్టపడి పండించిన ధాన్యానికి మద్దతు ధర ఇచ్చేలా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రెండు రోజుల్లో నగదు తమ బ్యాంకు ఖాతాల్లో పడేలా చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. జీలుగుమిల్లి సొసైటీ వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. నియోజకవర్గంలో 36 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 23వేల ఎకరాల్లో వేసిన వరిపంట ద్వారా 73వేల టన్నులు ధాన్యం కొనుగోలు చేస్తారన్నారు. 18లక్షల గోనె సంచులు అందుబాటులో ఉన్నాయన్నారు. జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్, సొసైటీ చైర్మన్ సరిపల్లి సత్యనారాయణరాజు, ఏడీ బుజ్జిబాబు, ఏవోలు కె.గంగాధరం, కె.పోశారావు, ఏఈవో బాలాజీ, ఎంపీపీ కె.పోశమ్మ, సర్పంచ్ చిర్రి జగదాంబ, ఎంపీటీసీ నాలి శ్రీను, నాయకులు చాట్రాతి ప్రసాద్, వీరాబత్తుల ధనుంజయ ఉన్నారు.

అభయాంజనేయ స్వామి అన్నదానానికి విరాళం



పెదపాడు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): అప్పనవీడులో ప్రసిద్ధి చెందిన అభయాంజనేయ స్వామి దేవాలయం వద్ద ప్రతి మంగళవారం జరిగే అన్నదాన కార్యక్రమానికి నూజివీడుకు చెందిన పీవీఎన్ఎస్ రాంప్రసాద్, తేజశ్రీ దంపతుల కుమార్తె చిరంజీవి నిఖిర అదోక్షజ రూ.3.50 లక్షల విరాళాన్ని అందజేశారు. మంగళవారం దేవాలయం వద్ద అన్నదాన ట్రస్టీ పేరు మీద డీడీని ఆలయ చైర్మన్ వేమూరి శ్రీనివాసరావుకు అందజేశారు. ప్రత్యేక పూజలనంతరం విరాళం అందజేసిన దాతలను శేషవస్త్రంతో కప్పి ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈవో పి.తారకేశ్వరరావు పాల్గొన్నారు.

కైకరంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

నిడమర్రు నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మానవత ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఉంగుటూరు శాఖ ఆధ్వర్యంలో భీమవరం విష్ణు డెంటర్ కాలేజీ, రాజేశ్వరి లయన్స్ నేత్రాలయం నిడదవోలు ఆధ్వర్యంలో కైకరంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో కంటికి సంబంధించి 134 మందికి పరీక్షలు నిర్వహించగా 22 మంది ఆపరేషన్లు సిఫారసు చేశారు. దంతాలకు సంబంధించి 120 మందిని పరీక్షలు చేయగా 85 మందికి ఉచిత చికిత్సలు చేశారు. మానవతా విస్తరణ అభివృద్ధి కమిటీ చైర్మన్ సాగిరాజు జానకిరామరాజు, రీజనల్ చైర్మన్ పుప్పాల గోపి, మండల మానవత అధ్యక్షులు కోనే సత్యనారాయణ, కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, అడపా శ్రీనివాసరావు, బుల్లిబ్బాయి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టండి

హైవే అథారిటీ అధికారులకు ఎమ్మెల్యే చింతమనేని సూచన



పెదవేగి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించినప్పుడే ప్రభుత్వంపై ప్రజలకు భరోసా కలుగుతుందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన అంశాలపై తగిన చర్యలు చేపట్టాలని ఆయన సంబంధిత శాఖాధికారులకు సూచించారు. పెదవేగి మండలం దుగ్గిరాల కార్యాలయంలో జాతీయ రహదారి అథారిటీ అధికారులతో ఎమ్మెల్యే ప్రభాకర్ మంగళవారం సమీక్ష నిర్వహించారు. గత కొన్నేళ్లలో జరిగిన రహదారి ప్రమాదాలను పరిగణలోకి తీసుకుని, ప్రమాదాలు జరగడానికి గల కారణాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాల కారణంగా ఎంతో మంది జీవితాలు రోడ్డున పడుతున్నాయన్నారు. ఇదే నిర్లక్ష్య ధోరణి కొనసాగిస్తే చూస్తూ ఉపేక్షించబోమన్నారు. రహదారులను మరింత పటిష్టంగా నిర్మించాలని అధికారులకు సూచించారు. హైవే అథారిటీస్ ప్రాజెక్టు డైరెక్టర్ విద్యాసాగర్, రెసిడెన్షియల్ ఇంజనీర్ నాగేశ్వరరావు, కాంట్రాక్టు ప్రాజెక్టు మేనేజర్ మహేష్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

కరెంటోళ్లు ఎంతపని చేశారు!



ఏలూరు రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మొక్కలను నాటండి వాటిని రక్షించండి పర్యావరణాన్ని కాపాడండి.. అంటూ ఎప్పటికప్పుడు అధికారులు చేస్తున్న ప్రచారాన్ని పక్కన పెడితే.. ఉన్న చెట్లనే బతకనిచ్చేలా కనిపించడం లేదు. పెరిగిన చెట్లపై గొడ్డలి వేటు వేస్తున్నారు. విద్యుత్ లైన్ మరమ్మతులు పేరుతో పచ్చని చెట్లను యథేచ్ఛగా నరుకుతున్నా అధికారులు పట్టించుకోకపోవడాన్ని జనాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. శుక్రవారం వచ్చిందంటే చాలు పట్టణంలో ఎక్కడ చూసినా ట్రాన్స్కో అధికారులు విద్యుత్ లైన్లకు చెట్లు, కొమ్మలు అడ్డం పేరుతో అడ్డు తొలగిస్తున్నారు. లైన్లకు తగిలే, రాసుకునే కొమ్మలను తొలగిస్తే ఇబ్బంది లేదు కానీ, చెట్లనే లేకుండా చేస్తున్నారు. ఏలూరు కలెక్టరేట్ వద్ద ఇదిగో ఇలా చెట్లను మొదలుతో సహా నరికేశారు.





వేగవరం జడ్పీ పాఠశాల.. అధ్వానంగా ఉన్న ఆట స్థలం

లిఫ్ట్ దొరికితేనే పాఠశాలకు

● గ్రామానికి 2 కిలోమీటర్ల దూరంలో వేగవరం జడ్పీ పాఠశాల

జంగారెడ్డిగూడెం రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలు పలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రభుత్వం నుంచి రావలసిన నిధుల్లో కూడా కోత విధించడంతో వచ్చిన కొద్ది సొమ్ములను సరిపెట్టలేక ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని వేగవరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మొత్తం 130 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో 35 మంది పదవ తరగతి విద్యార్థులు ఉన్నారు. వీరికి 9 మంది ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్నారు. వేగవరం, బీసీ కాలనీ, కొప్పులవారిగూడెం, కొత్తగా ఏర్పాటు చేసిన జగనన్న కాలనీ నుంచి విద్యార్థులు పాఠశాలకు వస్తున్నారు. అయితే ఈ గ్రామాలన్నింటికీ ఈ పాఠశాల దూరంగా ఉంది. దాదాపు 2 కిలోమీటర్ల వరకు విద్యార్థులు నేషనల్ హైవే ద్వారా రావలసి ఉంటుంది. కనీసం ఆర్టీసీ బస్సులు కూడా ఈ పాఠశాలకు వెళ్లే మార్గంలో ఆగవు. ఇక పాఠశాల ముగిశాక విద్యార్థులంతా అటుగా వెళ్లే ద్విచక్రవాహనాలను లిఫ్టులు అడుగుతూ వెళ్లాల్సిన పరిస్థితి. గతంలో కూడా ఈ పాఠశాలకు వెళ్లే మార్గం వద్ద ఆర్టీసీ బస్సులను నిలుపుదల చేయాలని తల్లిదండ్రులు కోరినా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ క్రమంలో ద్విచక్రవాహనాలపై లిఫ్టులు అడుగుతూ ప్రమాదకరంగా విద్యార్థులు పాఠశాలకు వచ్చి పోతున్నారు. అలాగే పాఠశాలకు వెళ్లే మార్గం కూడా ఇటీవల కురిసిన వర్షాలకు కొట్టుకుపోయింది. కంకర లేసిన మార్గం గుండానే చిన్నారులు వెళ్లాల్సిన పరిస్థితి. ఇక చాలీ చాలని తరగతి గదులు. గ్రంథాలయం, ల్యాబ్‌ల కొరతతో ఇక్కడ విద్యాభ్యాసాలు సాగుతున్నాయి. అలాగే పాఠశాలకు సంబందించిన ఆట స్థలం సైతం పిచ్చిమొక్కలతో పాము, విషపురుగులకు ఆవాసంగా ఉన్నాయి. ప్రభుత్వం స్పందించి విద్యార్థుల కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

అబుల్ కలామ్ అజాద్ స్ఫూర్తి ప్రదాత : ఏఎస్పీ



ఏలూరు క్రైం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): దేశంలో విద్యా పునాదిని బలోపేతం చేయడంలో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ చేసిన కృషి స్ఫూర్తి దాయక మని జిల్లా అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి ఏఎస్పీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో విద్యాభివృద్ధిలో భాగంగా దేశంలోనే మొట్టమొదటి ఐఐటీ(ఖరగ్‌పూర్)ను ఏర్పాటు చేశారన్నారు.

మినీగోకులం.. పాడి రైతుకు వరం



లింగపాలెంలో నిర్మించిన గోకులం షెడ్డు

లింగపాలెం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాడి రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోంది. మినీ గోకులాల పేరుతో పశువులకు షెడ్లు నిర్మించేందుకు చర్యలను వేగవంతం చేసింది.

దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్న అధికారులు

పశువుల షెడ్ల నిర్మాణాలకు రైతులకు అదనపు ఖర్చు లేకుండా రాయితీ వెసులు బాటు కల్పించింది. లబ్ధిదారులు పది శాతం భరిస్తే మిగతా 90 శాతం సబ్సిడీతో ఉపాధి హామీ నిధులు కేటాయించేలా చర్యలు చేపట్టారు. మండలంలో 22గ్రామాల్లో రూ.కోటి వ్యయంతో 50 పశువుల షెడ్ల నిర్మాణాలకు ప్రతిపాదించగా ఇప్పటి వరకు ఐదు పూర్తయ్యాయి. మిగిలినవి వచ్చే మార్చి నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్టు ఉపాధి హామీ అధికారులు చెపుతున్నారు. ఈ మినీ గోకులాల నిర్మాణాల్లో ఎస్సీ, ఎస్టీ, సన్న, చిన్నకారు రైతులకు ప్రాధాన్యం కల్పిస్తూ రెండు పశువులుంటే రూ.1.15 లక్షలు, నాలుగు పశువులు ఉంటే రూ. 1.85 లక్షలు, ఆరు పశువులు ఉంటే రూ.2.30 లక్షలతో షెడ్డు నిర్మించుకునే వెసులుబాటు ఉంటుంది. వాటిలో 90 శాతం ఉపాధి హామీ నిధులు కాగా మిగిలిన పది శాతం లబ్ధిదారులు చెల్లించాల్సి ఉంటుంది.

దరఖాస్తులు తీసుకుంటున్నాం



జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలో 50 యూనిట్లు మంజూరయ్యాయి. మండలంలోని పశువుల షెడ్ల నిర్మాణాలకు ఆసక్తి ఉన్న పాడి రైతుల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నాం. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హులను ఎంపిక చేసి వారు షెడ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసేలా పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

జెడ్.వరలక్ష్మి, ఇన్‌చార్జి ఏపీవో

ఢిల్లీ దోషులకు శిక్ష తప్పదు: ఎంపీ

ఏలూరు టూటౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరిగిన బాంబు పేలుళ్ల దోషులకు కఠిన శిక్ష తప్పదని ఎంపీ పుట్టా మహేశ్ అన్నారు. ఢిల్లీ పేలుళ్ల సంఘటనలో 12మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోవడం విచారకరమన్నారు. దోషులను వదిలే ప్రసక్తేలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం త్వరలోనే వారిని పట్టుకుని శిక్ష విధిస్తుందన్నారు. కేంద్ర పభద్రత దళాలు దోషుల కోసం గాలిస్తున్నాయన్నారు.

తాగునీటి సరఫరాకు చర్యలు

పెదపాడు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పెదపాడు మండలం అప్పనవీడు పంచాయతీ పరిధిలో పూర్తి స్థాయిలో తాగునీటి సరఫరాకు తగిన చర్యలు తీసుకుంటున్నట్టు కార్యదర్శి పద్మారావు తెలిపారు. అప్పనవీడు పంచాయతీ జాతీయ రహదారి తాళ్లమూడిలో పైపులైన్ పగిలిపోవడంతో నీరు రోడ్డుపైకి చేరుతోంది. సమాచారం అందుకున్న పంచాయతీ కార్యదర్శి పద్మారావు పైపులైన్‌కు మరమ్మతులు చేయించి, తిరిగి నీటి సరఫరాను పునరుద్ధరించారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

ఏలూరు రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): దోమల వృద్ధిని అరికట్టాలంటే ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు అన్నారు.ఏలూరు రూరల్ మండలం చాటపర్రు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మల్కాపురంలో సీజనల్ వ్యాధులపై ర్యాలీ, ప్రజలకు అవగాహన కల్పించారు. ఆరోగ్య విస్తరణాధికారి రామాజనేయులు, కిరణ్ కుమార్ జోషి, మేక శ్రీనివాసరావు, ఆరోగ్య కార్యకర్త రేణుక, పావని, ఆశా కార్యకర్తలు, రమణ, గీతకుమారి పాల్గొన్నారు.

108 కలశాలతో శోభాయాత్ర

జీలుగుమిల్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మంగళవారం పురస్కరించుకుని అభయాంజనేయస్వామి ఆలయంలో 108 కలశాలతో శోభాయాత్రం నిర్వహించారు. మహిళలు కలశాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. 108 కలశాల నీటితో స్వామి వారికి జలాభిషేకం చేశారు. అర్చకులు కస్తూరి చిరంజీవి శర్మ, సహస్ర నామార్చనలు చేశారు. ఆలయ చైర్మన్ కోలా ధర్మరాజు, కమిటీ సభ్యులు కక్కిరాల అప్పారావు, కొప్పుల అన్నవరం, గంధం వెంకటేశ్వరరావు, మండల దీక్ష చేపట్టిన హనుమాన్ స్వాములు ఉన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

ఏలూరుటూటౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థలో ఉద్యోగులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నగర అధ్యక్షులు ఎల్.కృష్ణారావు కోరారు. పాండురంగా థియేటర్ వద్ద సంఘ కార్యాలయంలో మాట్లాడుతూ ఎన్నోసార్లు సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి విన్నవించామన్నారు. ప్రభుత్వం తమ సమస్యలు పట్టించుకోకపోవడంతో ఈ నెల 14 నుంచి మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామన్నారు. నూకరాజు, వెంకటేశ్వరరావు, రాము, నాగరాజు, అప్పలరాజు పాల్గొన్నారు.



సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే చంటి

క్రీడల వైపు మొగ్గు చూపాలి : చంటి

ఏలూరు టూటౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. మంగళవారం భారతీయ క్రీడాసాధికార సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయికేలో ఇండియా సెంటర్ క్విట్ ఫ్రీడం రన్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కార్యక్రమాలు చేపట్టిందన్నారు.స్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఈడీ గుర్నామ్‌సింగ్, ఏపీ ఒలింపిక్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ బడేటి వెంకట్రామయ్య, డీఎస్‌డీఓ అజీజ్, కోచ్‌లు వీ.ఉదయ సందీప్, ఎస్.కరన్‌డే పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న సంఘ సభ్యులు

ఫొటో గ్రాఫర్స్ సంఘం ఎన్నిక

భీమడోలు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): భీమడోలు సర్కిల్ ఫొటో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎంపిక మంగళవారం జరిగింది. సంఘ అధ్యక్షుడిగా సి.హెచ్.ప్రభుచౌదరి, కార్యదర్శి శ్రీనివాసరావు, కోశాధికారి కె.శివరామకృష్ణ, ఉపాధ్యక్షులు చిన్నిలీలా కృష్ణలను ఎన్నుకున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల నాయకులు భీమడోలు సర్కిల్ ఫొటో గ్రాఫర్స్ పాల్గొన్నారు.

దాసాంజనేయకు ప్రత్యేక అలంకారం

ఏలూరుకార్పొరేషన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలోని మంగళవారం కావడంతో నరసింహారావుపేటలోని దాసాంజనేయ స్వామి ఆలయం వద్ద స్వామికి ఆలయ అర్చకులు రెండుచింతల నారాయణశర్మ పంచామృతాభిషేకం జరిపి కరెన్సీతో అలంకరించారు. కోటదిబ్బ వద్ద ఉన్న గణపతి త్రిదేవి పీఠం ప్రాంగణంలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఆలయ ధర్మకర్త చిందా రాజు భక్తులకు అన్నప్రసాద వితరణను నిర్వహించారు. రేషన్ డీలర్ల సంఘ నాయకులు రాజులపాటి గంగాధరరావు, పసుపులేటి శివ, బత్తిన సత్యనారాయణమూర్తి, చిందా కృష్ణంరాజు బృందం భక్తులకు సేవలందించారు. పాత బస్టాండ్ సమీపంలోని పాండురంగ సమీపంలో గల దాసాంజనేయస్వామి కోవెలలో ఆలయ ధర్మకర్త రెళ్ళ రామకృష్ణ ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరుకార్పొరేషన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కౌలు రైతులకు సమగ్ర చట్టం రూపొందించి అన్ని సంక్షేమ పథకాలతో పాటు పంటల బీమాను వర్తింపజేయాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా సమితి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద చర్చాగోష్ఠి నిర్వహించారు. సమావేశంలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గన్ను వెంకట్రావు, తక్కెళ్ళపాటి ప్రసాదరావు, కాట్రు వెంకట్రామయ్య, బోడిగడ్డ యేసుపాదం, కె.శ్రీనివాస్, ఏఐటీయూసీ నాయకులు పుప్పాల కన్నబాబు, పి.కిషోర్ పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక దీపోత్సవం

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక సత్రంపాడులోని లక్ష్మీగణపతిస్వామి ఆలయం వద్ద భక్తులు సామూహికంగా కార్తీక దీపాలను వెలిగించి ఆరాధించారు. కార్తీకనామ స్తోత్రాలను పఠించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి సన్నిధిలో కార్తీక దామోదర పూజలు జరిపారు. ఆలయ అర్చకులు రెండుచింతల రాఘవేంద్రశర్మ భక్తజనంతో వారి గోత్రనామాలతో అర్చనలు జరిపారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సి.హెచ్.చిననాగేశ్వరరావు, సిబ్బంది, భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు.



స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా ఆలయ ద్వితీయ వార్షికోత్సవం

కామవరపుకోట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): తడికలపూడిలోని అభయాంజనేయస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కామవరపుకోట లలితా శ్రీపీఠం వ్యవస్థాపకులు సుదర్శనం రామదుర్గ కుమారాచార్యులు, వెంకట సత్య శ్రీనివాసాచార్యులు, వైకానస ఆగమోక్త ప్రకారం పూజా కార్యక్రమాలు భక్తులతో నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

పంచాయతీల్లో ఆదాయ వనరులు సమకూర్చుకోండి

టి.నరసాపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి):గ్రామ పంచాయతీలు ఆదాయ వనరులు సమకూర్చుకోవాలని ఎంపీడీవో జి.మణికుమారి తెలిపారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఆర్‌జీఎస్‌ఏ కార్యాచరణ ప్రణాళికలో భాగంగా పంచాయతీల్లో ఆదాయ వనరుల పెంపుపై సర్పంచులు, కార్యదర్శులకు మంగళవారం శిక్షణనిచ్చారు. చెట్లు, చెరువులు, షాపింగ్ కాంప్లెక్స్ కుళాయి పన్నులు, భవన నిర్మాణ అనుమతుల ఫీజులపై వచ్చే ఆదాయం, గ్రామాభివృద్ధికి చేయాల్సిన ఖర్చులపై శిక్షణనిచ్చారు. టీవోటీలు ఎన్.నాగలక్ష్మి, బి.శైలజ శిక్షణనిచ్చి అవగాహన కల్పించారు. పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.



పెదవేగిలో కార్యదర్శులతో ఎంపీడీవో, సర్పంచ్‌లు

● పెదవేగి: పంచాయతీలు స్వయం సమృద్ధిని సాధించాలని, ఆదాయ వనరులు పెంచుకోవాలని పెదవేగి ఎంపీడీవో కె.రవికుమార్ అన్నారు. పెదవేగి ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని, ఆదాయాన్ని సమకూర్చుకోవాలన్నారు. సర్పంచ్‌లు తాతా శ్రీరామ్మూర్తి, మేకా కనకరాజు, కార్యదర్శులు కృష్ణంరాజు, కేవీప్రసాద్, సాయి కృష్ణ, సందీప్, హేమంత్ పాల్గొన్నారు.

● పెదపాడు: పంచాయతీలు సొంత ఆదాయ వనరులపై దృష్టి సారించాలని పెదపాడు ఇన్‌చార్జి ఎంపీడీవో ఇందిరాగాంధీ తెలిపారు. పెదపాడు ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శిక్షణ ఇచ్చారు..ఇన్‌చార్జి ఎంపీడీవో ఇందిరా గాంధీ మాట్లాడుతూ చెత్త నుంచి సంపద సృష్టితో పంచాయతీలను బలోపేతం చేసుకోవాలన్నారు. మండల శిక్షణ అధికారి కంకర్ల తంబి శిక్షణలో పలు అంశాలు తెలియజేశారు. ఈవోలు వినోద్, పద్మా రావు, శివయ్య పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్: పంచాయతీలు ఆదాయ వనరులు పెంచుకోవాలని ఏలూరు ఎంపీడీవో నాగరాజకుమారి సూచించారు. మంగళవారం ఏలూరు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీకి సొంత వనరులు ఎలా పెంచుకోవాలనే అంశంపై శిక్షణలో భాగంగా ఎంపీడీవో దిశానిర్దేశం సూచించారు.

● కొయ్యలగూడెం: ఆదాయ వనరులను వినియోగించుకుని అభివృద్ధి చెందాలని ఎంపీడీవో కిరణ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు మంగళవారం మండల పరిషత్ సమావేశ హాల్లో మండలంలోని సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీలకు వచ్చే నిధులు సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని ఆయా పంచాయతీల్లో ఆదాయమార్గాలు పెంపొందించుకోవాలన్నారు.

● కుక్కునూరు: పంచాయతీలను బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మంగళవారం కుక్కునూరులో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం జరిగింది. పంచాయతీలు స్వయంగా అభివృద్ధి చెందడానికి యాక్షన్ ప్లాన్ రూపొందించడానికి తగన సూచనలు చేశారు. పంచాయతీలకు వచ్చే నిధులు, వాటి ఖర్చు, పాలనలో పారదర్శకత సామార్థ్యం, ప్రజలను భాగస్వాములను చేయడం వంటి అంశాలపై శిక్షణనిచ్చారు. ఎంపీడీవో నాగరాజు, ఈవోపీఆర్డీ నరసింహరావు, కుక్కునూరు కార్యదర్శి ధర్మా పాల్గొన్నారు.



అజాద్ చిత్రపటం ఎదుట నివాళులర్పిస్తున్న దృశ్యం

అబుల్ కలాం అజాద్‌కు నివాళి

కామవరపుకోట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మౌలానా అబుల్‌కలాం అజాద్ చిత్రపటానికి ప్రిన్సిపల్ కె.విజయబాబు, అధ్యాపకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విజయబాబు మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం కృషి చేయడంతోపాటు తొలి విద్యా శాఖా మంత్రిగా విద్యా విధానంలో గొప్ప సంస్కరణలను తీసుకొచ్చిన మౌలాన అబుల్ కలాం ఆజాద్ సేవలు ప్రశంసనీయమన్నారు. ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ జి.శ్రీనివాసరావు, అధ్యాపకులు ఎం.ఉషారాణి, దారావతు మల్లేష్, కె.ఇందిరాకుమారి, బి.రాజు, ఎం.విజయకృష్ణ, వి.కల్పన పాల్గొన్నారు.

కార్మికులకు గుర్తింపు కార్డులు పంపిణీ

ఏలూరు రూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఇ-శ్రమం కార్డు నమోదు కార్యక్రమంలో భాగంగా మంగళవారం గవరవరం, శనివారపుపేట గ్రామంలోను, ఏలూరు నగరంలో నాయి బ్రాహ్మణ సంఘంలోని కార్మికులను ఇ-శ్రమం పోర్టల్‌లో నమోదు చేయించి, వారికీ గుర్తింపు కార్డులను అందజేసినట్టు ఉప కార్మిక కమిషనర్, పి.నివాస్ తెలిపారు.ఈ నమోదు ప్రక్రియలో జీవీ రమణ, జె.గోపాల్‌కృష్ణ, ఒకటో సర్కిల్, రెండో సర్కిల్, సహాయ కార్మిక అధికార్లు పాల్గొన్నట్టు తెలిపారు. అసంఘటిత రంగంలో పనిచేసే ప్రతీ కార్మికులు ఉచితంగా ఆన్‌లైన్లో హెచ్‌టీటీపీఎస్:ఈశ్రమ్.జీవో.ఇన్‌లో ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా నెంబర్, ఫోన్ నెంబర్‌తో నమోదు చేసుకోవచ్చని అన్నారు. అసంఘటిత రంగంలోని కార్మికులంతా నమోదు చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా చింతలపూడి ఏఎంసీ ప్రమాణ స్వీకారోత్సవం

చింతలపూడి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): చింతలపూడి వ్యవసాయ మార్కెట్ కమిటీ జిల్లాలో 11వ కమిటీ ప్రమాణ స్వీకారం స్థానిక మార్కెట్ యార్డులో పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ సమక్షంలో ఘనంగా జరిగింది. గౌరవాధ్యక్షుడిగా ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్, అధ్యక్షురాలిగా చీదరాల దుర్గాపార్వతి, పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ చింతలపూడి ఎత్తిపోతల పథకంపై ఎమ్మెల్యే రోషన్‌కుమార్ ప్రతీ డీఆర్‌పీ సమావేశంలో ప్రస్తావిస్తున్నారని, అదే విధంగా జిల్లా మంత్రి కొలుసు పార్థసారథి పలుమార్లు ప్రస్తావించారని పేర్కొన్నారు. చదువుతోపాటు టెక్నాలజీలో కూడా రాణించాలన్నారు.కూటమి ప్రభుత్వం రైతులకు ఎంతో ప్రాధాన్యం ఇస్తోందని, ప్రతీ గింజ కొనుగోలు చేస్తామన్నారు. ముందుగా ఫైర్‌స్టేషన్ నుంచి భారీ ర్యాలీ జరిగింది. డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు మాట్లాడుతూ ప్రస్తుతం డబ్బు ఉన్నవారే రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. రైతులకు, పోలవరం నిర్వాసితులకు తగిన ప్రాధాన్యం ఇచ్చి సమస్యలు పరిష్కరించాలని అన్నారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ, జగ్గవరపు ముత్తారెడ్డి, చీదరాల మధుబాబు, కొటికల గోవిందరావు, మేకా ఈశ్వరయ్య, దాసరి చంద్రశేఖర, పలువురు నాయకులు పాల్గొని మాట్లాడారు.



పుస్తకాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

ప్రతి ఒక్కరూ ఇష్టంతో చదవాలి

ఏలూరురూరల్, నవంబరు 11,(ఆంధ్రజ్యోతి): కష్టపడి ఇష్టంతో చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ఏలూరు రూరల్ మండలం మానూరు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు తేరా ప్రసాద్ అన్నారు. మానూరు ప్రాథమిక పాఠశాలలో సెమిస్టర్ 2 పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు తేరా ప్రసాద్, ఉపాధ్యాయులు తాలాడ అరుణ పంపిణీ చేశారు. తల్లితండ్రులు పేరం శిరీష, తేరా సుభాషిని, తేరా సంధ్యారాణి, గోటికల రజిని, బ్యూలా జ్యోతి పాల్గొన్నారు.

26న రాజ్యాంగ దినోత్సవం

ఏలూరుకార్పొరేషన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవంలో భాగంగా రైతాంగం, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 26న కలెక్టరేట్‌ల వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్టు రైతు సంఘం నాయకులు బండి వెంకటేశ్వరరావు, కె.శ్రీనివాస్, ఎస్.కె.గౌస్, దొంతకృష్ణలు తెలిపారు. అన్నేభవనంలో ఈ మేరకు మంగళవారం చర్చలు నిర్వహించి ఆందోళనకు ప్రణాళికను రూపొందించారు. 26న భారీ ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ వద్ద ధర్నా చేయాలని నిర్ణయించారు. అన్ని గ్రామాల నుంచి రైతులను సమీకరించేందుకు చర్యలు తీసుకుంటామని నాయకులంతా ఏకగ్రీవంగా సంఘీభావం తెలిపారు.

వాలి సుగ్రీవుల గట్టు ఉత్సవం

కామవరపుకోట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీలోని పాతూరు గ్రామం సమీపంలోని వాలి సుగ్రీవుల గట్టు వద్ద కార్తీక మంగళవారం నేపథ్యంలో ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గట్టుపై ఉన్న తారాదేవి, గరుత్మంతుల వారికి పీఎస్ఎల్ ఆచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. తారాదేవి, గరుత్మంతుడు, ద్వార పాలకుల విగ్రహాలకు, రాములవారి పాదాలకు గట్టు సమీపంలో గల వాలీ సుగ్రీవులకు పూజలు జరిపారు. కామవరపుకోట పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. దాదాపు రెండు వేల మందికి ఉత్సవ కమిటీ సభ్యులు అన్నప్రసాద వితరణను నిర్వహించారు.

అప్పనవీడు, ఏపూరు గ్రామాల్లో గృహ నిర్మాణాల పరిశీలన

పెదపాడు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పనవీడు, ఏపూరు గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న గృహ నిర్మాణ పనులను ఏఈ జి.రామచంద్ర మంగళవారం పరిశీలించారు. నిర్మాణ పనుల్లో లబ్ధిదారులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ప్రభుత్వ పరంగా లబ్ధిదారులకు ఏవిధమైన లబ్ధి చేకూరుతుందో తెలియజేసి నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ కె.ప్రశాంత్ పాల్గొన్నారు.

నేత్రాలు సంరక్షించుకోవాలి

ఏలూరురూరల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నేత్రాలను సంరక్షించుకోవాలని, కంటి వ్యాధులు వస్తే అశ్రద్ధ చేయకుండా వైద్యులను సంప్రదించాలని రవి కిరణ్ కంటి వైద్య నిపుణులు డాక్టర్ రవి కిరణ్, హేమలత అన్నారు. సత్రంపాడు సిద్ధార్థ విద్యాలయంలో మంగళవారం రవి కిరణ్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రవి కిరణ్ మాట్లాడుతూ మానవ శరీరంలో కళ్లు ప్రధానమని వాటిని సంరక్షించుకోవాలన్నారు. శిబిరాన్ని సిద్ధార్థ విద్యాలయ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కోనేరు సిద్ధార్థ ప్రారంభించారు. డాక్టర్ హేమలత కంటి సమస్యలు, శుక్లాలు, కళ్ల కలకలను ముందస్తుగా గమనించి తగిన చికిత్సలు పొందాలన్నారు. ఈసందర్భంగా కంటి చూపు, రెటీనా, గ్లాకోమ పరీక్షలు చేశారు. ప్రిన్సిపాల్ పీఎస్ కుమార్, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



చింతమనేనికి ఆహ్వానం పలుకుతున్న దృశ్యం

యూనియన్ బ్యాంక్ శాఖ ప్రారంభం

దెందులూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంక్ సేవలు నాణ్యతతో వేగంగా అందించాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. మంగళవారం దెందులూరులో నూతనంగా ఏర్పాటు చేసిన యూనియన్ బ్యాంక్ శాఖను మేనేజర్‌తో కలిసి దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రారంభించారు. దెందులూరు సర్పంచ్ తోట యేసమ్మ, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి వెంకటేశ్వరావు, సంపంగ వేణుగోపాల తిలక్, పార్టీ గ్రామాధ్యక్షుడు కొల్లేపర భాస్కర్‌రావు, బ్యాంక్ సిబ్బంది ఉన్నారు.

వీఆర్వోలపై ఫిర్యాదు.. బదిలీలు

పోలవరం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పోలవరం మండలంలో పని చేస్తున్న గ్రామ రెవెన్యూ అధికారుల పనితీరుపై ప్రజల నుంచి ఫిర్యాదులు అందిన నేపథ్యంలో మంగళవారం తహసీల్దారు బి.సాయిరాజు వారిని బదిలీలు చేశారు. పోలవరం మండలంలో పట్టిసీమ వెంకటాపురం వీఆర్వో ఎన్.బాపిరాజును పోలవరం రెవెన్యూ 3, చేగొండపల్లి వీఆర్వో బి.రమాదేవిని పట్టిసీమ, వెంకటాపురం, ప్రగడపల్లి వీఆర్వో షేక్ లాల్ షరీఫ్‌ని చేగొండపల్లి, గెడ్డపల్లి ఎస్ భవానీని ప్రగడపల్లి, గెడ్డపల్లి, పోలవరం 3 వీఆర్వో వై.గాంధీని పోలవరం 1, 2 లకు బదిలీ చేసినట్లు తహసీల్దారు తెలిపారు.

ఆంధ్రజ్యోతి నూజివీడు
కైకలూరు, నూజివీడు
7 www.andhrajyothy.com ● బుధవారం 12 నవంబరు 2025

'రీసర్వేతో భూసమస్యలకు పరిష్కారం'

ఆగిరిపల్లి, నవంబరు 11, (ఆంధ్రజ్యోతి) : రీసర్వే ద్వారా అన్ని భూసమస్యలకు పరిష్కారం లభిస్తుందని సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకుడు షేక్ మహమ్మద్ అన్సారీ అన్నారు. కృష్ణవరంలో జరుగుతున్న రీసర్వేను మంగళవారం ఆయన పరిశీలించారు. రైతులను కలిసి రీసర్వే విధి విధానాలను, సూచనలు, సలహాలు ఇస్తూ రైతుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. రైతులు వ్యక్తం చేసిన సందేహాలను నివృత్తి చేశారు. ఆగిరిపల్లి మండల సర్వేయర్ రామకృష్ణబాబు, కృష్ణవరం సర్వేయర్ వినోద్‌కుమార్ నాయక్, రైతులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచిత ఫిజియోథెరపీ శిబిరం

ముసునూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రమణక్కపేట మెయిన్ పాఠశాలలో ఉన్న భవిత సెంటర్‌లో దివ్యాంగులకు ఉచిత ఫిజియోతెరెధెరపీ శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పది మంది చిన్నారులకు డాక్టర్ ప్రశాంతి చికిత్స అందించి, వారి పట్ల తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రభుత్వం దివ్యాంగులకు అందించే ఉపకరణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఐఈఆర్పీలు డీఎంపీఎల్ నారాయణరావు, జె.నాగమల్లేశ్వరి, హెచ్ఎం పి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పంటలకు మెరుగైన ధరే ఫుడ్ ప్రాసెసింగ్ లక్ష్యం

- ప్రతి మండలంలోనూ 'నైబర్హుడ్ వర్క్ ప్లేస్' ఏర్పాటు
- పొలాల్లో సోలార్ విద్యుత్ ఏర్పాటుతో రైతులకు అదనపు ఆదాయం

మొర్సపూడిలో రూ.102 కోట్లతో ఫుడ్‌పార్కు పనులకు మంత్రి పార్థసారథి శంకుస్థాపన



మొర్సపూడి సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సారథి

నూజివీడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):రైతులు తాము పండించే పంటలకు మెరుగైన ధరను కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ లక్ష్యమని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ప్రకాశం జిల్లా కనిగిరిలో రాష్ట్ర ముఖ్యమంత్రి వర్చ్యులు 60 పారిశ్రామిక ప్రాజెక్టులు, 51 మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ)ల ప్రారంభోత్సవంలో భాగంగా నూజివీడు మండలం మొర్సపూడిలో రూ.102 కోట్లతో ఏర్పాటు చేసే రమణ్‌సింగ్ గ్లోబల్ ఫుడ్‌పార్క్ పనులను మంగళవారం వర్చువల్‌గా శంకుస్థాపన చేయగా, మొర్సపూడిలో మంత్రి పార్థసారథి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశ ప్రధాని మోదీ సహకారంతో రాష్ట్రాన్ని వ్యవసాయపరంగా, ఆర్థికంగా, పారిశ్రామికంగా దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపేందుకు విజన్ కలిగిన నాయకుడు రాష్ట్ర సీఎం చంద్రబాబునాయుడు అలుపెరగని కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు 20 కొత్త పారిశ్రామిక పాలసీలు తీసుకువచ్చామని, అందులో ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ ఒకటన్నారు. రమణ్‌సింగ్ గ్లోబల్ ఫుడ్‌పార్క్ ఏర్పాటు ద్వారా 700 మంది యువతకు ప్రత్యక్షంగా, 1500 మందికి పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయ న్నారు. ఈనాటి యువత ఉద్యోగం కోసం నిరీక్షించడం నుంచి మరొకరికి ఉద్యోగం అందించే స్థాయికి తీసుకెళ్లడమే స్వర్ణాంధ్ర-2047 విజన్ లక్ష్యమన్నారు. రాష్ట్రంలో వర్క్ ఫ్రమ్ హోమ్ చేసే సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల కోసం ప్రతీ మండ లంలోనూ 'నైబర్హుడ్ వర్క్ ప్లేస్' రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసే ఆలోచనలో ఉందన్నారు. పంట పొలాల్లో సాగుకు అడ్డులేకుండా సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసి, రైతులకు మరింత ఆదాయం అందించేలా ప్రభుత్వం ఆలోచన చేస్తుంద న్నారు. నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి విజన్ స్వర్ణాంధ్ర-2047 సాధనలో అందరూ భాగస్వా ములు కావాలన్నారు. రాష్ట్ర చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు భాస్కరరావు, విజయ మిల్క్ డైరీ ఛైర్మన్ చలసాని ఆంజనే యులు, ఎంపీపీ శిరీష ప్రసంగించారు. ఈ సందర్భంగా పారిశ్రామికవేత్తకు ప్రభుత్వ ప్రోత్సాహకాల చెక్కును మంత్రి అందించారు. అనంతరం మంత్రిని రమణ్‌సింగ్ గ్లోబల్ ఫుడ్ పార్కు యాజమాన్యం గోగినేని బాబు, గోగినేని పద్మావతి, బాలాజీ తదితరులు సత్కరించారు. జిల్లా పరిషత్ సీఈవో శ్రీహరి, గృహనిర్మాణశాఖ పీడీ సత్యనారాయణ, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ బాబ్జి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కనిగిరిలో పాల్గొన్న కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు.

సీహెచ్ పోతేపల్లిలో ఆగ్రోవెట్‌కు శంకుస్థాపన

ద్వారకాతిరుమల/ఏలూరుటౌన్:మలేషియతో పోటీపడుతూ జిల్లా రైతాంగం ఆయిల్‌పాం దిగుబడిని సాధించడం రాష్ట్రానికి గర్వకారణ మని జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహ ర్ కోరారు. ద్వారకాతిరుమల మండలం సీహెచ్ పోతేపల్లిలో సీఎం చంద్రబాబు వర్చువల్‌గా రూ.210కోట్లతో నిర్మించే గోద్రేజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ పరిశ్రమ శంకుస్థాపన కార్యక్రమానికి మంగళవారం ఆయన హాజరయ్యారు.

పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం : ఎమ్మెల్యే చంటి

ఔత్సాహికులైన యువ పారిశ్రామికవేత్తలను అన్నివిధాలా ప్రోత్సహిస్తూ ప్రభుత్వం ముందుకు వెళ్తుందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఏలూరు ఏఎస్ఆర్ స్టేడియంలో ఏపీ ఎంఎస్ఎంఈ అండ్ ఇంటర్‌ప్రెన్యూర్ డెవలప్ మెంట్ పాలసీలో భాగంగా 2.2 ఎకరాల్లో రూ.14 కోట్లతో ఏర్పాటు చేయనున్న ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్, పారిశ్రామికవాడ నిర్మాణ పనులను మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు.



రహదారుల నిర్మాణాల్లో నాణ్యత పాటించాలి

శృంగవరప్పాడులో రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజబాబు

కైకలూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని రహదారుల నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎంపీడీవో ఆర్.రాజబాబు అన్నారు. మంగళవారం శృంగవరప్పాడులో నూతనంగా నిర్మాణం చేస్తున్న సిమెంటు రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. అనంతరం గ్రామ సచివాలయన్ని తనిఖీ చేసి సూచనలు చేశారు. సచివాలయాల ద్వారా ప్రజలకు సత్వర సేవలు అందించేందుకు అధికారులు సమయపాలన పాటించడంతో పాటు సమస్యలను ఎప్పటి కప్పుడు పరిష్కరించాలన్నారు. రహదారి నిర్మాణాల్లో ప్రజా వినియోగానికి ఎక్కువగా ఉపయోగపడే వాటిని గుర్తించి సిమెంటు రోడ్డు నిర్మాణం చేయాలన్నారు. మండల పరిషత్ ఏవో బాలశంకరరావు, డిప్యూటీ ఎంపీడీవో అప్పారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ టవర్లకు ప్రభుత్వ స్థలం మంజూరు

కలిదిండి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సంతోషపురం, లోడిదలంక, కొండూరు గ్రామాల్లో బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ల ఏర్పాటుకు ప్రభుత్వం స్థలం మంజూరు చేశామని తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు. ఒక్కో సెల్ టవర్‌కు ఐదు సెంట్లు ప్రభుత్వ స్థలం అప్పగించామన్నారు. త్వరలో సెల్ టవర్ల నిర్మాణ పనులు చేపడతామన్నారు. ఆయా గ్రామాల్లో సెల్ ఫోన్లను సిగ్నల్ లేకపోవడంతో బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలి

ముసునూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని ఎంపీడీవో పిల్లి సత్యనారాయణ హెచ్చరించారు. చెక్కపల్లి సచివాలయ సిబ్బంది పనితీరుపై స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదుపై మంగళవారం సచివాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సమయానికి సచివాలయాన్ని తెరసి ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. పలు సమస్యపై సచివాలయానికి వచ్చే ప్రజలకు అన్నిసౌకర్యాలు కల్పించి, ఉత్తమ సేవలు అందించాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం, సమయపాలనపై మరోసారి ఫిర్యాదు వస్తే సహించేది లేద న్నారు. సర్పంచ్ తల్లిబోయిన రాధిక సత్యనారాయణ, డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ తదితరులు పాలొన్నారు.

'క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలి'

ఆగిరిపల్లి, నవంబరు 11, (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని రాష్ట్ర విద్య పరిశోధన శిక్షణ మండలి ప్రొఫెసర్ డాక్టర్ బీవీ రామకృష్ణ అన్నారు. మెగా డీఎస్సీ 2025లో ఎంపికైన నూతన ఉపాధ్యాయులకు శిక్షణలో భాగంగా తోటపల్లి హిల్ స్కూల్లో జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన సందర్శించి మాట్లాడారు. సంప్రదాయ బోధన కంటే కృత్యాధార బోధన విద్యార్థులపై ఎంతో ప్రభావం చూపిస్తుందని, ఎక్కువ కాలం గుర్తుంటుందని అన్నారు. రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి కోఆర్డినేటర్ రుపావత్ రంగయ్య, ఎంఈవోలు ఆనంద్‌కుమార్, బీవీఎస్ సుబ్బారావు, రిసోర్స్ పర్సన్లు మాతంగి రత్నకుమార్ బాబు, వి.శ్రీనివాసశాస్త్రి, మిర్యాల సాయికుమార్, గంజి సత్యక్రుపావరం, సముద్రాల శ్రీరామ్, ఎస్‌జీటీ హరిబాబు పాల్గొన్నారు.

సరిహద్దు వివాదం.. ఒకరికి గాయాలు

ముదినేపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ముదినేపల్లి మండలం వడాలి గ్రామంలో ఇళ్ల స్థలాల సరిహద్దు విషయమై ఏర్పడిన వివాదం దాడికి దారితీసింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. ఈనెల 7న గ్రామంలో గతంలో పెద్దలు చెప్పిన ప్రకారం బి.సత్యనారాయణ, ఫణీంద్ర అనే వ్యక్తులు తమ స్థలం సరిహద్దులో సిమెంటు పిల్లర్లు పోస్తున్నారు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన సరిహద్దుదారుడు వలివెల వసంత కుమార్ పిల్లర్లు వేస్తున్న విషయంపై ప్రశ్నించగాపై ఇరువురు వ్యక్తులు వసంతకుమార్‌పై దాడికి పాల్పడి కొట్టి గాయాలకు గురి చేశారు. వెంటనే అతడిని గుడివాడ ప్రభుత్వాసుపత్రికి 108 వాహనంలో భార్య తరలించింది. ఆసుపత్రి నుంచి మంగళవారం వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం : మంత్రి



ఎల్ఓసీ చెక్కును అందిస్తున్న మంత్రి సారథి

నూజివీడు టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చులకు ఇబ్బంది పడుతున్న పేదలకు సీఎం సహాయ నిధి వరం అని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న నూజివీడు మండలం దిగవల్లి గ్రామానికి చెందిన బాధిత తన్విష్ కుటుంబ సభ్యులకు నాలుగు లక్షల రూపాయల ఎల్ఓసీ పత్రాన్ని లాంచనంగా అందించారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు వేమూరి సత్యనారాయణ, చందమాల సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళాకు విశేష స్పందన



నియామక పత్రాలను అందజేస్తున్న జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జితేంద్రబాబు

ఆగిరిపల్లి, నవంబరు 11, (ఆంధ్రజ్యోతి) : స్థానిక జడ్పీ హైస్కూల్లో మంగళవారం జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ముఖ్య అతిథిగా ఎంపీడీవో బి.భార్గవి జాబ్ మేళాను ప్రారంభించి మాట్లాడారు. జాబ్‌మేళాలో 19 కంపెనీలు వారు అభ్యర్థులకు ఇంటర్వ్యూ చేశారన్నారు. ఈ జాబ్ మేళాలో పదో తరగతి నుంచి గ్రాడ్యుయేషన్ చేసిన వారు పాల్గొన్నారన్నారు. జాబ్ మేళాకు 248 మంది నిరుద్యోగులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా, వీరిలో 114 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎన్.జితేంద్రబాబు తెలిపారు. అనంతరం ఇంటర్వ్యూలో ఎంపికైన వారికి ఆయా కంపెనీల నియామక పత్రాలను అందజేశారు. ఏలూరు డీపీవో ప్రవీణ్, ఎంఆర్‌వో పీఎస్‌వీ ప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు ఎస్ వేణు, నూజివీడు నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షుడు ఆరేపల్లి శ్రీనివాసరావు, మదుపల్లి గోపాల్, మాదల సత్యకుమార్, చౌటపల్లి విక్టర్ బాబు, ముల్లంగి శ్రావణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ల అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా సర్జన్‌రాజు



సర్జన్ రాజును సత్కరిస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

ముదినేపల్లి, నవంబరు11 (ఆంధ్రజ్యోతి) : ముదినేపల్లి మండల పాస్టర్ల ఆత్మీయ సమావేశాన్ని మంగళవారం కొత్తపల్లిలోని ఒనెసిమ్ చర్చిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలస్థాయిలో పాస్టర్ల నూతన అసోసియేషన్ ఏర్పాటైంది. తొలిసారిగా ఏర్పాటైన మండల స్థాయి పాస్టర్స్ ఎవాంజలిస్ట్ ఐక్య అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉచ్చుల సర్జన్‌రాజు, ఉపాధ్యక్షులుగా ఈజె సుధాకర్, బండి ప్రేమకుమార్, కార్యదర్శులుగా పి.రాజేంద్రప్రసాద్, గొల్లా యోహాను, కోశాధికార్లుగా డి.ప్రసన్నరాజు, డి.రాజ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా ఎన్నికైన సర్జన్‌రాజును పాస్టర్లు సత్కరించి అభినందించారు.

'రైతుల కోసమే ధాన్యం కొనుగోలు కేంద్రాలు'

ముదినేపల్లి/చాట్రాయి, నవంబరు11(ఆంధ్రజ్యోతి): రైతులకు ఆర్థికంగా వెన్నుదన్నుగా ఉండేందుకే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు టీడీపీ కైకలూరు నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు అన్నారు. ముదినేపల్లి మండలం వడాలి గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో పౌరస రఫరాల శాఖ ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి, పచ్చజెండాను ఊపి ధాన్యం రవాణాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర కల్పించి గంటల వ్యవధిలోనే సొమ్మును బ్యాంకు ఖాతాలకు కూటమి ప్రభుత్వం జమ చేస్తుండడం పౌరసరఫరాల శాఖ చరిత్రలో ఇదే ప్రథమమని అన్నారు. మండలంలో 14 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలన్నది తమ లక్ష్యమని ఏవో వేణుమాధవ్ తెలిపారు. పెదగొన్నూరు నీటి సంఘం వైస్ ఛైర్మన్ కట్టా కోటయ్య, టీడీపీ నాయకులు నక్కా అప్పారావు, చిలకలపల్లి నాగరాజు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

చీపురుగూడెంలో..

చాట్రాయి మండలంలోని చీపురుగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం టీడీపీ నాయకులు ప్రారంభించారు. టీడీపీ నాయకులు బొట్టు రామచంద్రరావు, బొట్టు లక్ష్మణరావు, మందలపు జగదీష్, చిన్నంపేట పీఏసీఎస్ అధ్యక్షుడు గుంట్రు కుటుంబరావు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చాట్రాయిలో ఎట్టకేలకు సీసీ రోడ్డు నిర్మాణం




చాట్రాయిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు

చాట్రాయి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): చాట్రాయి గ్రామ పరిధిలో మెయిన్ సెంటర్ నుంచి ఊర చెరువు కట్ట వరకు ప్రధాన రహదారికి సీసీ రోడ్డు పనులు ఎట్టకేలకు ప్రారంభమై చురుగ్గా జరుగుతు న్నాయి. చిత్తపూరు-బూరుగుగూడెం రహదారి పరిధిలో ఉన్న ఈ రోడ్డు పూర్తిగా ధ్వంసమై భారీ గోతులు పడి వాహనచోదకులు, ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ రోడ్డు అభివృద్ధికి నూజివీడు ఎమ్మెల్యే, మంత్రి కొలుసు పార్థసారథి చొరవతో రూ.3 కోట్లు నిధులు మంజూరై ఆరు నెలల క్రితం టెండర్లు పూర్తయ్యాయి. కాంట్రాక్టర్ పనులు ప్రారంభంలో జాప్యం జరిగింది. చాట్రాయి గ్రామ పరిధిలో 600 మీటర్లు సీసీ రోడ్డు నిర్మాణంతో పాటు అక్కడ నుంచి బూరుగుగూడెం వరకు రెండు కిలోమీటర్లు బీటీ రోడ్డు నిర్మాణం జరుగుందని అధికారులు చెబుతున్నారు. కూటమి నాయకుల విజ్ఞప్తి మేరకు అధికారులకు మంత్రి ఆదేశాలు ఇవ్వడంతే ఎట్టకేలకు పనులు ప్రారంభం కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జనార్దనవరం శివాలయంలో లక్ష దీపోత్సవం

చాట్రాయి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి):జనార్దనవరం శివాలయంలో సోమవారం రాత్రి లక్ష దీపోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.



శివాలయంలో లక్ష దీపోత్సవం

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	246
చికెన్ స్కిన్‌లెస్	256

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475



విరాళాన్ని డీడీ రూపంలో అందజేస్తున్న నిఖిర అదోక్షజ

అభయాంజనేయస్వామి అన్నదానానికి రూ.3.50 లక్షలు విరాళం

పెదపాడు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి):అప్పనవీడులో ప్రసిద్ధి చెందిన అభయాంజనేయస్వామి దేవాలయం వద్ద ప్రతి మంగళవారం జరిగే అన్నదాన కార్యక్రమానికి నూజివీడుకు చెందిన వీవీఎస్ రాంప్రసాద్, తేజశ్రీ దంపతుల కుమార్తె చిరంజీవి నిఖిర అదోక్షజ రూ.3.50 లక్షల విరాళాన్ని అందజేశారు. మంగళవారం దేవాలయం వద్ద అన్నదాన ట్రస్టీ పేరు మీద డీడీని ఆలయ ఛైర్మన్ వేమూరి శ్రీనివాసరావుకు అందజేశారు. ప్రత్యేక పూజలనంతరం విరాళం అందజేసిన దాతలను శేషవస్త్రంతో కప్పి ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈవో పి.తారకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి

నూజివీడు టౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : దేశ చరిత్రను రాయడమే కాదు దాన్ని సృష్టించడమే సర్దార్ వల్లభాయ్ పటేల్ ధ్యేయమని రాజ్యసభ సభ్యులు పాకా వెంకట సత్యనారాయణ అన్నారు. వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం నూజివీడు చిన్న గాంధీబొమ్మ సెంటర్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిషోర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాకా సత్యనారాయణ మాట్లాడుతూ దేశ ఏకతకు పటేల్ చేసిన కృషి ఎప్పటికీ మరువలేమన్నారు. బీజేపీ సీనియర్ నాయకులు మల్లెపూడి రాజశేఖర్, మాటూరి రవికాంత్, బోను అప్పారావు, మాటూరి ప్రసాద్, మాగంటి వాసు, వసుంధరదేవి పాల్గొన్నారు.

'జాయింట్ ఎల్పీ నంబర్లను సరిచేసుకోవాలి'

కైకలూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రైతులు రీసర్వేలో ఉమ్మడి ఎల్పీ నంబర్లను సరిచేసుకోవాలని తహసీల్దార్ ఆర్.రామకృష్ణారావు అన్నారు. మంగళవారం కైకలూరు మండలం రాచపట్నంలో రీసర్వే గ్రామసభను నిర్వహించారు. జాయింట్ ఎల్పీ నంబర్లను పరిష్కరించేందుకు అధికారులే నేరుగా గ్రామాల్లో గ్రామసభలు ఏర్పాటు చేస్తున్నామని రైతులు ఈ గ్రామసభల్లో రీసర్వే సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ఎల్పీ నంబర్లను ఎప్పటికప్పుడు రైతులు సరిచేసుకోవడం వల్ల భూసమస్యలు తలెత్తకుండా ఉంటాయన్నారు. అనేకమంది ఎల్పీ నంబర్లను సరిచేసుకునేందుకు రెవెన్యూ కార్యాలయానికి వస్తున్నారని ఈ గ్రామసభల ద్వారా గ్రామాల్లోనే ఆ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. డిప్యూటీ తహసీల్దార్ పి.వనజాక్షి, సర్వేయర్ రమేష్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

వేర్వేరుచోట్ల పది మంది జూదరుల అరెస్ట్

ముసునూరు/ముదినేపల్లి, నవంబరు11(ఆంధ్రజ్యోతి): వేర్వేరు చోట్ల పేకాటాడుతున్న మొత్తం పది మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. ముసునూరు మండలం బలివే గ్రామ శివారు తోటలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు మంగళవారం దాడి చేశారు. దాడిలో ఎనిమిది మంది అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.13,500 నగదు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఎం.చిరంజీవి తెలిపారు. వీరిపై కేసు నమోదు చేశామన్నారు. ముదినేపల్లి శివారు అన్నవరం కాలనీలో మంగళవారం పేకాట నిర్వహణపై ఎస్ఐ వీరభద్రరావు ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి ఇద్దరు జూదరులను అరెస్టు చేసి వారి నుంచి రూ.2800 నగదును స్వాధీనం చేసుకున్నారు. జూదరులను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.



కైకలూరులో ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు



పెయ్యేరు పాఠశాలలో బహుమతులు అందజేస్తున్న రాజేంద్రప్రసాద్

ఘనంగా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు

కైకలూరు/ముదినేపల్లి,నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ సంస్కరణలు విద్యార్థులకు దోహదపడ్డాయని ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీలత అన్నారు. మంగళవారం కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర శాఖ ఆధ్వర్యంలో ఆజాద్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మొట్టమొదటి విద్యాశాఖమంత్రిగా చేసిన సేవలకు గుర్తింపుగా నవంబరు 11వ తేదీన ఎడ్యుకేషన్‌డేగా నిర్వహిస్తున్నామన్నారు. వైస్ ప్రిన్సిపాల్ అడపా కేధారి, అధ్యాపకులు, ఎం హరిప్రసాద్, ఆర్.జాలబాబు, జ్ఞానప్రసూనాంబ, రవికుమార్, కుముదా, తదితరులు పాల్గొన్నారు. ముదినేపల్లి మండలం పెయ్యేరు ఎలిమెంటరీ పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఏలూరు జిల్లా కార్యదర్శి బేతాళ రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో అబుల్ కలాం ఆజాద్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యా సామర్థ్యాన్ని, ప్రతిభను చూపించిన పలువురు విద్యార్థులకు ఆయన ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో విద్యా కమిటీ ఛైర్మన్ మున్నీసా, ఉపాధ్యాయులు చక్రధర్, తదితరులు పాల్గొన్నారు.

'కొనుగోలు కేంద్రాల్లో పంటకు మద్దతు ధర'




లోపూడిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో చాముండేశ్వరి

ముసునూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతులు తమ ధాన్యాన్ని కొలుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని ఏవో ఎ.చాముండేశ్వరి అన్నారు. మంగళవారం లోపూడిలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కోత దశలో ఉన్న వరి పంటలను ఆమె పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలో గ్రేడ్-ఎ రకం క్వింటాకు రూ.2,389, సాధారణ రకాలకు క్వింటాకు రూ.2379 ప్రభుత్వం మద్దతు ధరగా నిర్ణయించిదన్నారు. పంటలో తేమశాతం 17 శాతంలోపు ఉండేలా రైతులు చూసుకోవాలన్నారు. హమాలీ, ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులను వివరించారు. ఖరీఫ్ సీజన్‌లో ఈ-పంట నమోదు ప్రక్రియ నూరుశాతం పూర్తయిందని, ఈనెల 12 నుంచి జాబితాలను ప్రదర్శిస్తా రన్నారు. జాబితాలో అభ్యంతరాలు ఉంటే వ్యవసాయ సిబ్బంది దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు. రబీ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో సీడ్ మొక్కజొన్న సాగు చేసే రైతులు కంపెనీ యాజమాన్యంతో బాండ్ చేసుకుని, విత్తనాలు పెట్టుకోవాలన్నారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు చలమాల వెంకటేశ్వరరావు, వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

110 ఎకరాల్లో పంట నష్టం

కలిదిండి:మొంథా తుఫాన్ ప్రభావంతో కోరుకొల్లు, సానారుద్రవరం, గోపాలపురం, వెంకటాపురం, గ్రామాల్లో 110 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని ఏవో విద్యాసాగర్ తెలిపారు. మంగళవారం వెంకటాపురం, కొండూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ రెండు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ధాన్యంలో తేమ శాతం లేకుండా చూసుకోవా లన్నారు. తేమ శాతం ఎక్కువగా ఉంటే ధాన్యానికి గిట్టుబాటు ధర లభించదన్నారు. వ్యవసాయాధికారి ధర్మతేజ, రైతులు పాల్గొన్నారు.



కార్తీక వనసమారాధనలో కచేరి వాయిద్యకారులను సన్మానించిన సంఘ నాయకులు

ఘనంగా నాయీ బ్రాహ్మణ కార్తీక వనసమారాధన

ముదినేపల్లి, నవంబరు11(ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండల శ్రీభక్తాంజనేయ స్వామి నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక శ్రీరామా రైసు మిల్లు ఆవరణలో కార్తీక వనసమారాధన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ ఆర్టిస్టు, నంది అవార్డు గ్రహీత ప్రకాశం జిల్లాకు చెందిన ఈశ్వరయ్య, కచేరి ఆర్టిస్టులు సీహెచ్. నారాయణ, ఎం.రాజేష్, టీటీడీ ఆస్థాన విద్వాంసులు రంపచోడవరానికి చెందిన అన్నవరపు అంకరాజు, ఏలూరుకు చెందిన సీహెచ్.రాజ్ కుమార్‌లను నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు సత్కరించారు. మండలంలోని పలువురు వాయిద్య, డోలు విద్వాంసులనూ సన్మానించారు. వనసమారాధన కమిటీ సభ్యులు నందూరి వెంకటేశ్వరరావు, దాలిపర్తి లక్ష్మీనారాయణ, చిలకలపల్లి నాగరాజు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ అర్జీలపై ఎంపీడీవో విచారణ

ముసునూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలపై ఎంపీడీవో పిల్లి సత్యనారాయణ మంగళవారం విచారణ చేశారు. చింతలవల్లికి చెందిన జోనుబోయిన రాంబాబు తనకు ఆటోమిత్ర పథకంలో నగదు రాలేదని ఇచ్చిన అర్జీ, రమణక్కపేటలో చేతి పంపును వినియోగంలోకి తీసుకురావాలని ఉప్పే నాగాంజనేయులు పెట్టిన అర్జీలపై ఎంపీడీవో విచారణ చేశారు. ఆటోమిత్ర పథకం నగదుపై సంబంధిత అధికారులతో మాట్లాడగా రెండో విడతలో రాంబాబు నగదు వస్తుందని సంబంధిత అధికారులు చెప్పినట్లు ఎంపీడీవో తెలిపారు. చేతిపంపు ఉన్న స్థలం కోర్టులో ఉన్నందున ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. డిప్యూటీ ఎంపీడీవో బీప సత్యనారాయణ, ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.